ప్రజాశక్తి


శనివారం 3 జూన్ 2023 8 పేజీలు

ప్రకాశం బాపట్ల





ఉపాధ్యాయుల బదిలీలపై గందరగోళం



- తప్పిదాలతో ఉపాధ్యాయుల జాబితాలు
- సవరించేందుకు కసరత్తు చేస్తున్న విద్యాశాఖ
- 4వ తేదీ ఖాళీలు ప్రకటించేందుకు చర్యలు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

ఉపాధ్యాయుల బదిలీల జాబితాలపై గందరగోళం కొనసాగుతోంది. గతంలో జరిగిన తప్పిదాలే ఇప్పుడూ పునరావృతమవుతున్నాయి. ఉపాధ్యాయ సంఘాల సూచనలను పరిగణలోకి తీసుకోకుండా విద్యాశాఖ అదికారులు హడావుడిగా చేసిన జాబితాలు మొత్తం బదిలీల ప్రక్రియనే గందరగోళంలో పడేశాయి. దీంతో బదిలీలు సజావుగా సాగుతాయా? లేదా? అనే మీమాంసలో ఉపాధ్యాయులున్నారు. తప్పిదాలను సవరించేందుకు విద్యాశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. శుక్రవారం నాటికి కొన్నిటిని సరిచేశారు. ఇంకా 20 శాతానికి పైగానే ఉన్నట్లు యుటిఎఫ్ నేత రవి వెల్లడించారు. వీటిని సరిచేయకుంటే బదిలీల ప్రక్రియ సజావుగా సాగడం కష్టమని చెబుతున్నారు. బదిలీల కోసం మొత్తం 6 వేల మంది వరకూ ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 8 ఏళ్లు నిండినందున 3 వేల మంది వరకూ తప్పనిసరిగా బదిలీ కావాల్సి ఉంది. మిగతా 3 వేల మంది రిక్వెస్ట్ కింద ఉన్నారు. అవకాశం ఉంటే బదిలీ కావచ్చు. బదిలీల్లో ప్రస్తుతం ఉన్న స్థానం కన్నా మంచిది దొరికితే వెళతారు. లేకుంటే అక్కడే ఉండే అవకాశం కూడా ఉంది. ఉద్యోగోన్నతిపై వెళ్లే వారితో పాటు బదిలీలు కోరుకునే వారి జాబితాలు ఇపుడు సిద్ధం చేశారు. వాటిని పరిశీలిస్తే అనేక తప్పిదాలు చోటుచేసుకున్నాయి. వీటిని ఇప్పుడు సరిచేస్తున్నారు. బదిలీకి సమ్మతించిన వారి పేర్లు ▶ 2లో

బింగినపల్లి చెరువు ఆక్రమణ

- పైపులు వేసి రోడ్డు వేస్తున్న వైనం
- అంతా వైసిపి నాయకుల కనుసన్నల్లోనే..
- 105 ఎకరాల కబ్జాకు యత్నం!

ప్రజాశక్తి-శింగరాయకొండ

అధికార వైసిపి నాయకులు ఏం చేసినా.. అడిగేవారు కరువయ్యారు. బింగినపల్లి చెరువుకి సంబంధించి చెరువు పోరంబోకు భూమిని దొంగ పట్టాలతో వైసీపీకి చెందిన నాయకులు ఆక్రమిస్తున్నారు. ఆ భూమిలోకి వెళ్లాలంటే రోడ్డు మార్గం వేయాలని ఏకంగా చెరువులోనే రోడ్డు వేసే ప్రయత్నాలు మొదలుపెట్టారు. పట్టించుకోవలసిన అధికారులు మాత్రం అటు వైపు కన్నెత్తి కూడా చూడని పరిస్థితి.

సర్వే నెంబర్ 331లో 105 ఎకరాల చెరువు పోరంబోకు భూమి ని గతంలో కొందరు నాయకులు రెవెన్యూ కార్యాలయంలో పట్టాలు పుట్టించారు. ఆ అధికారులు బదిలీ అయిపోగానే ఆ పట్టాలను బయ టకు తీసి చెరువులోకి రంగ ప్రవేశం చేశారు. ఇలా బింగినపల్లి చెరువును అడ్డాగా మార్చుకొని వైసిపి నేతలు ఎలాగైనా భూమిని స్వాధీనం చేసుకోవాలని స్థానికంగా ఉన్న నాయకులకు పదోపరకో అప్పగించి...



జెసిబితో చెరువులో రోడ్డు వేస్తున్న దృశ్యం

ఏకంగా చెరువులోకే రోడ్డు వేస్తున్నారు. సర్వే నెంబర్ 331లో కొంత భూమి, సర్వే నెంబర్.330లో కొంతభూమిని ఆక్రమించుకొని బాగుచేశారు. దొంగ పట్టాలు చూపించుకుంటూ.. చెరువులో ఉన్న పోరంబోకు భూమిని నొక్కేసే ప్రయ త్నాల్లో భాగంగా గత వారం రోజులుగా పాలేరు-బిట్రగుంట ఛానల్ కు సంబం ధించి బింగినపల్లి చెరువుకు వెళ్లే కాలు వలో ఏకంగా పైపులు వేసి.. కల్వర్టు నిర్మాణం చేపట్టారు. ఈ విషయం బిం గినపల్లి రైతులకు, నాయకులకు తెలిసినప్పటికీ వాళ్లు కన్నెత్తి కూడా చూడని పరిస్థితి. కోట్ల రూపాయలు విలువ చేసే చెరువు పోరంబోకు భూ ములు అన్యాక్రాంతమైపోతుంటే ఇరిగే షన్, రెవెన్యూ అధికారులు కూడా పట్టించుకోవటం లేదు. చెరువులో కల్వర్టు నిర్మాణం చేపట్టి ఏకంగా రోడ్డు నిర్మాణం చేస్తున్నారు. జిల్లా యంత్రాంగం దష్టి పెట్టి బింగినపల్లి చెరువును కాపాడాలని రైతులు కోరుతున్నారు.



చెరువులో పైపులు వేసి ఉన్న దృశ్యం

పర్చూరు అధికారపార్టీలో గ్రూపుల పోరు బహిర్గతం

- వైసిపి ఇన్‌ఛార్జి ఆమంచిపై పార్టీ అధిష్టానానికి స్థానిక నేతల ఫిర్యాదు!
- అక్రమంగా ఆదాయంపైనే దృష్టి పెట్టారని ఆరోపణలు
- సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్న ఫిర్యాదు ప్రతి



ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

పర్చూరు నియోజకర్గ వైసిపిలో నెలకొన్న అంతర్గత కుమ్ములాటలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. ఒకరిపై మరొకరు ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకుంటూ.. ఇక్కడ జరుగుతున్న అక్రమాలను, ఇతర విషయాలను వైసిపి అధిష్టానం దృష్టికి తీసుకెళుతున్నారు. వైసిపి పర్చూరు ఇన్‌ఛార్జిగా ఆమంచి కృష్ణమోహన్ వచ్చాక పార్టీలో అంతర్గత విభేదాలు పెరిగాయని, అందుబాటులో ఉన్న సహజ వనరులతో ఆదాయ సముపార్జనే ధ్యేయంగా నియోజకవర్గంలో ఇన్‌ఛార్జి వ్యవహారం ఉందన్న ఆరోపణలతో పార్టీ అధినేత జగన్‌కు లిఖితపూర్వక ఫిర్యాదులు వెళ్లాయి.

పర్చూరులో ఆదాయం, చీరాలలో రాజకీయం చేస్తున్నారంటూ పిర్యాదులు చేశారు. ఈ నేపథ్యంలో పర్చూరులో ఏమి జరుగుతుందనే విషయమై వైసిపి పెద్దలు ఆరా తీస్తున్నారు. ఈ మేరకు ఐ ప్యాక్ బృందం, ఇంటిలిజెన్స్ వర్గాల ద్వారా సమాచారాన్ని రాబడుతున్నారు.

ఆమంచి కృష్ణమోహన్‌ను పార్టీ అధినేత జగన్ పర్చూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా నియమించారు. ఇలా చేయడం ద్వారా చీరాల నియోజకవర్గంలో నెలకొని ఉన్న గ్రూపు తగాదాలకు స్వస్తి చెప్పవచ్చన్న భావన కూడా ఉంది. రానున్న ఎన్నికల్లో పర్చూరు నుంచి ఆమంచి అభ్యర్థి అయితే గెలుపు అవకాశాలు ఎక్కువ ఉంటాయనేది అధిష్టానం అభిప్రాయం. ఈ నియామకం విషయమై మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి నుంచి భిన్నాభిప్రాయం ఉన్నా అంతిమంగా ఆమంచిని పర్చూరు ఇన్‌ఛార్జిగా నియమించారు. పర్చూరు వెళ్లడం అనేది ఆమంచికి ఇష్టం లేకపోవడంతో కొన్ని నెలల పాటు వాయిదా వేస్తూ వచ్చి చివరికి అంగీకరించాల్సి వచ్చింది. ఈ ఏడాది జనవరి నుంచి ఆమంచి పర్చూరు ఇన్‌ఛార్జీగా వ్యవహరిస్తున్నారు. ప్రారంభంలో అంతా బాగున్నట్లే అనిపించినా రానురానూ నియోజకవర్గంలో గ్రూపు తగాదాలు బయట పడుతూ వచ్చాయి. గతంలో ఇన్‌ఛార్జిగా ఉన్న రామనాథంబాబుకు వ్యతిరేకంగా ఉన్న వారందరూ వెంటనే ఆమంచి వైపు చేరిపోయారు. ఈ నియోజకవర్గంలో వైసిపికి చెందినవారు మొదటి నుంచి తమ పనుల కోసం మాజీ మంత్రి బాలినేని లేదా ఎంపీ నందిగం సురేష్ వద్దకు వెళ్ళేవారు. ఆమంచి ఇన్‌ఛార్జిగా వచ్చాక కూడా ఇదే ఆనవాయితీ కొనసాగింది. ఇలాంటి వారంతా పర్చూరులో ఆమంచికి వ్యతిరేకులుగా అయ్యారు. గతంలో వైసిపి చెందిన గ్రామ, మండల నేతలు తమ స్తోమతను బట్టి గ్రామాలు, మండలాల్లో రేషన్ బియ్యం సరఫరా, గ్రావెల్, గ్రానైట్ వ్యవహారాలను చూసుకొనేవారు. ఆమంచి వచ్చాక పర్చూరులో ఆ దారులన్నీ మూసుకుపోయాయి. అన్ని వ్యవహారాలు ఇన్‌ఛార్జి కనుసన్నల్లో జరగడం మొదలైంది.

ఆమంచిపై సిఎంకు ఫిర్యాదులు!

ఈ నేపథ్యంలో ఆమంచిపై సొంత పార్టీకి చెందిన వారే సిఎం జగన్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. సిఎం జగన్‌కు నివేదించినట్లు చెబుతున్న వివరాల ప్రకారం.. పర్చూరు నియోజకవర్గం లోని మార్టూరు మీదుగా ప్రతి రోజూ 60 నుంచి 70 లారీల గ్రానైట్ రవాణా బల్లికురవ నుంచి జరుగుతుంది. ప్రతి గ్రానైట్ లారీ వారు రూ.8 వేలు చొప్పున ఇన్‌ఛార్జిచే నియమించబడిన వారికి కప్పం చెల్లించాలి. ఇలా రోజూ సగటున 63 గ్రానైట్ ▶ 2లో



బాపట్ల మండలం, మూలపాలెంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వ్యకాస జిల్లా కార్యదర్శి కృష్ణమోహన్

'ఉపాధి'కి నిధులు తగ్గించడం దారుణం ▶ 7లో

ఆయువు తీసిన అప్పులు

ఉరేసుకొని రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి-యర్రగొండపాలెం



రత్తయ్య (ఫైల్)

అప్పుల బాధ తాళలేక ఉరేసు కొని రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని కొలుకుల గ్రామంలో శుక్రవారం తెల్లవారు జామున చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. కొలుకుల గ్రామానికి చెందిన ఒంటేరు రత్తయ్య(49)కు రెండు ఎకరాల సొంత భూమి ఉంది. దీనికి తోడు గత మూడేళ్ల నుంచి మరో నాలుగు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని పత్తి, మిర్చి, కంది తదితర పంటలను సాగు చేస్తున్నాడు. వాతావరణం అనుకూలించకపోవడంతో పెట్టుబడులు కూడా రాక అప్పులపాలయ్యాడు. వడ్డీలు పెరిగి మొత్తం రూ.15 లక్షల దాకా అప్పులు తేలాయి. అప్పులిచ్చిన వారి నుంచి ఒత్తిడి తీవ్రమైంది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. అప్పులు చెల్లించే మార్గం లేక మదనపడుతున్నాడు. ఎప్పటిలాగే పిల్లలతో కలిసి తన భార్య ఇంటి వరండాలో పడుకుంది. రత్తయ్య మాత్రం ఇంట్లో పడుకున్నాడు. తెల్లవారుజామున చూసేసరికి ఉరేసుకొని చనిపోయాడు. ఘటనను చూసిన భార్య గంగాదేవి బోరున విలపిస్తూ పెద్దగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి రత్తయ్యను మంచంపై పడుకోబెట్టారు. మృతునికి భార్య గంగాదేవి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య గంగాదేవి ఇచ్చిన రిపోర్టు మేరకు ఎస్ఐ జి.కోటయ్య ▶ 2లో

పర్చూరు అధికారపార్టీలో గ్రూపుల పోరు బహిర్గతం

(మొదటిపేజీ తరువాయి)

లారీల నుంచి రూ.5 లక్షల మేరకు వసూళ్లు జరుపుతున్నారు. అలాగే మార్టూరు మండలంలో ఐదు అనుమతి ఉన్న గ్రావెల్ క్వారీలు ఉండగా వాటిలో ఒకటి ఇంకొల్లు జడ్‌పిటిసిది.. మరొకటి బాపట్ల బిసి సెల్ అధ్యక్షునిది.. ఆమంచి వచ్చాక ఈ రెండింటినీ బలవంతంగా మూసి వేయించారు. మిగిలిన మూడు గ్రావెల్ క్వారీలతో పాటు అక్కడి కోలలపూడి కొండల నుంచి అనధికారికంగా ఆమంచి వర్గీయులు గ్రావెల్‌ను టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారు. ప్రతి టిప్పర్ వద్ద రూ.500 వసూలు చేస్తున్నారు. సగటున 150 టిప్పర్ల వద్ద రోజుకు రూ.75 వేలు వసూలు చేస్తున్నారు. చినగంజాం మండలంలో ప్రభుత్వ భూముల్లో అనధికారికంగా ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. ఇక్కడి నుంచి ప్రతి రోజూ 30 లారీలకు తగ్గకుండా ఇసుక ఇతర రాష్ట్రాలకు తరలివెళుతోంది. దీంతో పాటు జెపి వెంచర్స్ పేరుతో చినగంజాం మండలంలో ఇసుక నిల్వ కేంద్రం ఏర్పాటు చేసి అక్కడి నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలించి అమ్ముకుంటున్నారు. ఇలా సగటున 200 వాహనాల ద్వారా ఇసుకను తరలించి ఒక్కొక్క వాహనం నుంచి రూ.2500 చొప్పున రోజుకు రూ.5 లక్షలు వసూలు చేస్తున్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 213 రేషన్ బియ్యం షాపులున్నాయి. సదరు బియ్యం పంపిణీ చేసే ఎండియూ ఆపరేటర్లు, రేషన్ డీలర్లపై ఒత్తిడి తెచ్చి మొత్తం రేషన్ బియ్యం అక్రమ రవాణాను ఇన్‌ఛార్జి అనుయాయులు నిర్వహిస్తున్నారు. ఇలా ప్రతి నెల రూ.50 లక్షల మేర రేషన్ బియ్యం అక్రమ అమ్మకాలు జరుగుతున్నాయి. ఇలా ప్రతి నెలా అక్రమ ఆదాయం రూ.3 కోట్లకు పైగా ఉంటుందని వైసిపి నేతలు సిఎంకు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. పర్చూరులో ఆదాయంపైనే ఆమంచి దృష్టి పెట్టడంతో మొదటి నుంచి వైసిపిలో ఉన్నవారు పార్టీకి దూర మవుతున్నారని ఆ పార్టీ నేతలే చెబుతున్నారు. తనకు నచ్చని వారి బిల్లులు ఆపివేయడం, వారి తరపు వారిని ఉద్యోగ భాధ్యతల నుంచి పక్కనపెట్టడం చేస్తున్నారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో పార్టీ పెద్దలు పర్చూరులో వైసిపి పరిస్థితులపై సర్వే చేపట్టినట్లు తెలుస్తోంది. మరో వైపు ఆమంచి చీరాలలో కూడా తమ పట్టు కోల్పోకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. మే నుంచి చీరాల నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న అన్ని రకాల ఫంక్షన్లు, ప్రారంభ కార్యక్రమాలకు ఆమంచి హాజరవుతున్నారు.

వికలాంగుల సంక్షేమానికి కృషి

ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్

ప్రజాశక్తి-దర్శి

వికలాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ తెలిపారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద వికలాంగులకు మూడు చక్రాల స్కూటర్లను శుక్రవారం పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వికలాంగుల కోసం అనేక పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. వికలాంగుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. తొలుత తాళ్ళూరు మండలం లక్కవరం గ్రామంలో మాజీ సర్పంచి ఇందిరాశివశంకర్‌రెడ్డి కుమారుడి వివాహ వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశమై సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనరు వెన్నపూస వెంకటరెడ్డి, గోళ్లపాటి అచ్చయ్య, విసి రెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వికలాంగులకు వాహనాలు అందజేస్తున్న ఎమ్మెల్యే

నూరుశాతం రుణాలు వసూలు చేయాలి : పీడీ

ప్రజాశక్తి- దొనకొండ

విఒఎలు నూరు శాతం రుణాలు వసూలు చేయాలని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ బాబూరావు తెలిపారు. స్థానిక వైసిపి కార్యాలయంలో ఎపిఎం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో విఒఎలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ గ్రూపులో ఆసక్తి గల ప్రతి మహిళకు చిన్న తరహా, మధ్య తరహా రుణాలు ఇప్పించాలన్నారు. గ్రూపులో నేటికి చేరని నిరు పేద మహిళలను గుర్తించి వారిని గూపులో చేర్పించాలన్నారు. తొలుత ధనలక్ష్మీ సెంట్రింగ్ యూనిట్‌ను ప్రారంభించారు. అనంతరం నూతనంగా ఏర్పాటు చేస్తున్న మహిళా మార్టు భవనాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. చిన్న తరహా యూనిట్లు ఏర్పాటు చేసుకొనేవారికి తాము రుణాలు అందజేస్తామని కెనరా బ్యాంక్ మేనేజర్ అశోక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపిఎం డేవిడ్, బ్యాంక్ లింకేజీ డిపిఎం సుబ్బారావు, ఏరియా కోఆర్డినేటర్ వసుంధరా దేవి, ఎపిఎం వెంకటేశ్వర్లు, సిసిలు , విఒఎలు తదితరులు పాల్గొన్నారు.




సెంట్రింగ్ యూనిట్ ప్రారంభిస్తున్న పీడీ

'గొల్లపూడి' జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-చీమకుర్తి

చీమకుర్తి రోటరీక్లబ్ అధ్యక్షుడు, యువ పారిశ్రామికవేత్త గొల్లపూడి చౌదరి పుట్టినరోజు వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో కేక్ కట్ చేసి ,స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ వేణు గోపాలరెడ్డికి ఫ్యాన్లు అందజేశారు. ఆసుపత్రిలోని రోగులకు పండ్లు,రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వేణుగోపాలరెడ్డి, రోటరీక్లబ్ నాయ కులు పరాంకుశం శ్రీనివాసమూర్తి, ముప్పూరి చలమయ్య, పోకూరి రామకృష్ణారెడ్డి ,కె.కరుణాకరరెడ్డి, తిరుపతిరెడ్డి, గొల్లపూడి ఫణి, జి.సుమంత్, సురేంద్ర,అశోక్, మన్నం నాగరాజు, గొల్లపూడి వెంకటరావు, హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వైద్యశాలకు ఫ్యాన్లు అందజేస్తున్న గొల్లపూడి చౌదరి

ఉపాధ్యాయుల బదిలీలపై గందరగోళం

(మొదటిపేజీ తరువాయి)

సమ్మతంగా లేనట్లు జాబితాల్లో వచ్చాయి. బదిలీ వద్దన్న వారి పేర్లు బదిలీ కోరుకున్నట్లు జాబితాల్లో చేరాయి. ప్రమోషన్లు అడిగిన వారి పేర్లు కొందరివి జాబితాల్లో కనిపించడం లేదు. అడగని వారిపేర్లు కొన్ని వచ్చినట్లు గుర్తించారు. రోస్టర్ పాయింట్లు సక్రమంగా రాలేదు. కొందరికి వెనుకాముందూ వచ్చాయి. దీని వల్ల సీనియారిటీ ఉన్న వారికి అన్యాయం జరుగుతుంది. కొన్ని విధానపరమైన విషయాల్లోనూ స్పష్టత లేదు. ఒక స్కూలులో ముగ్గురు ఉపాధ్యాయులుంటే వారిలో ఒకరు అదనంగా ఉన్నపుడు అక్కడ నుంచి ఒక్కరినే పంపాలి. ఒకరు ప్రమోషన్‌పై వెళితే ఇద్దరే ఉంటారు. అప్పుడు అక్కడ ఇద్దరు సరిపోతారు. అలా కాకుండా ప్రమోషన్‌పై వెళ్లేవారితో పాటు మరొకరు సీనియారిటీ ప్రకారం బదిలీ పెట్టుకుంటే అతన్ని కూడా పంపుతున్నారు. దీని వల్ల అక్కడ ఒక్కరే మిగులుతారు. అయితే ఒకరు ప్రమోషన్‌పై వెళితే అక్కడ ఇద్దరిని ఉంచాలని యుటిఎఫ్ సూచించింది. దీనిపై విద్యాశాఖ కమిషనర్ నుంచి ఆదేశాలు రావాలని జిల్లా అధికారులు చెబుతున్నారు. ఇలాంటివి కూడా అస్పష్టంగా ఉన్నాయని ఉపాధ్యాయులు అంటున్నారు. ఈ నెల 4న ఖాళీల జాబితాలు పూర్తిగా ప్రకటించాల్సి ఉంది. 5 నుంచీ బదిలీల కోసం ఆప్షన్లు పెట్టుకుంటారు. అందుకోసం తప్పిదాలు లేని జాబితాలు సిద్ధం కావాలి. ఖాళీలు పూర్తిగా ప్రకటించాల్సి ఉంది. ఏదేమైనా ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ ప్రహసనంగా మారింది.

ఆయువు తీసిన అప్పులు

(మొదటిపేజీ తరువాయి)

ఘటనాస్థలానికి చేరుకొని వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేసు నమోదు చేశారు.

రత్తయ్య కుటుంబానికి ప్రభుత్వం ఆదుకోవాలి..


అప్పులబాధతో ఆత్మహత్య చేసుకున్న ఒంటేరు రత్తయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని రైతుసంఘం ప్రకాశం జిల్లా అధ్యక్షుడు గాలి వెంకటరామిరెడ్డి డిమాండ్ చేశారు. మృతుని పిల్లలను ప్రభుత్వమే చదివించాలన్నారు. అప్పులను కూడా ప్రభుత్వం తీర్చాలని చెప్పారు. ఆ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు.

లోను రావాలంటే డబ్బులు ఇవ్వాల్సిందే..

ఎంసిపి లెటర్ ఇచ్చేందుకు రూ.500 నుంచి 3 వేల వరకు.. పొదుపు గ్రూపుల నుంచి తీసుకోవాలని విఒఎలపై సిసి ఒత్తిడి ● డిజిటల్ పేమెంట్ ద్వారా వసూళ్లు

ప్రజాశక్తి-బల్లికురవ రూరల్

బల్లికురవ మండలంలోని కొణిదెన క్లస్టర్ సీసీగా పనిచేస్తున్న పర్చూరి ప్రమీల క్లస్టర్ పరిధిలోని వివోఏలపై పెత్తనం చెలాయిస్తూ, నానా రకాలుగా దుర్భాషలాడుతూ వారిని వేధిస్తున్నారనే విమర్శలు వినవస్తున్నాయి. అదేంటని ప్రశ్నిస్తే వారికి వర్క్ చెప్పకుండా వారిని టార్గెట్ చేస్తూ ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతూ ఇబ్బంది పెడుతున్నారని అంటున్నారు. ఈ వేధింపులు తాళలేక గత నెలలో క్లస్టర్ పరిధిలోని ఒక వివోఏ నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యా యత్నం వరకూ వెళ్లిందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. వైఎస్సార్ క్రాంతి పథం మీటింగుల్లో కొన్ని క్లస్టర్‌లోని కొంతమంది వివోఏలు 'మీరు పెద్దగా మాట్లాడతారు.. మీ వల్లే కదా ఆమె ఇలా చేసుకున్నారు' అని అడిగారు. దీంతో ఆమె 'మీరు నాకు ఎదురు మాట్లాడతారా? మీ సంగతి చూస్తాను.. నన్ను మీరు ఏమీ చేయలేరు. నాకు ఏపీఎం, ఏసి గారి సపోర్టు ఉంది. ఒక్కొక్కరి సంగతి చూస్తాను' అంటూ బెదిరింపులకు పాల్పడినట్లు సమాచారం. మండలంలోని గ్రామాల్లోని పొదుపు గ్రూపులలోనూ అర్హత లెటర్ ఇవ్వాలన్నా, ఎంసిపి చేసినా, స్త్రీనిధి లోను కావాలన్నా ఆన్‌లైన్‌లో ఎంసిపికి రూ.500 నుంచి మూడున్నర వెయ్యి వసూలు చేస్తున్నట్లు వినికిడి. 'స్త్రీనిధి అప్లికేషన్ ఒక్కొక్కదానికి రూ.100 ఇవ్వాల్సిందే.. కూరగాయల బేరాలు ఉండవు' అని దబాయిస్తున్నట్లు చెబుతున్నారు. గ్రామాల్లోని వివోఏలు తమకు డబ్బులు గ్రూపుల వాళ్లు ఇవ్వట్లేదు అని చెప్పినప్పటికీ డబ్బులు ఇవ్వకపోతే ఎంసిపిలు చేయను అని ముఖం మీదే చెప్పేస్తున్నారు. చేసిన ప్రతి ఎంసిపి(మైక్రో క్రెడిట్ ప్లాన్)కి ఫోన్‌పే, గూగుల్‌పేల ద్వారా కూడా నిర్మొహమాటంగా నిర్భయంగా డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేయించుకుంటున్నారు. ఏమైనా ఇబ్బందులు వస్తాయేమో అన్నప్పటికీ 'మీకు అనవసరం. నాకు డబ్బులు ఇవ్వాల్సిందే, మీకేం ఇబ్బంది లేదు, నాకు పైవారి సపోర్ట్ ఉంది. నాకు ఏమీ కాదు, మీరు ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా పంపించండి. అని అమౌంట్ నిర్మొహమాటంగా తీసుకుంటున్నట్లు సమాచారం.



SHG MICRO CREDIT PLAN

District	BAPATLA	Mandal	Ballikurava	Village	Konidena
SHG	Bismilla	SB A/C NO	11645053628	VO	KONODENA GRAMAIKYA SANGAM
BANK	State Bank of India	BRANCH	KONIDENA	SHG CORPUS FUND	

S.NO	Name of the SHG member	Name of the Father/Husband	Social Category	Proposed Livelihood Activity	Proposed Sub Activity	Fund Name	Loan (Rs.)	SB A/C NO	Member sign
1	BAJIBI SHEK	Lalu	Minority	AGRICULTURE	AGRICULTURE IMPLEMENTS	Bank linkage	200000.00		
2	BASIRUN SHEK	Mastanvali	Minority	AGRICULTURE	AGRICULTURE IMPLEMENTS	Bank linkage	200000.00		
3	EMAMBHI SHEK	Chinamoulali	Minority	AGRICULTURE	AGRICULTURE IMPLEMENTS	Bank linkage	200000.00		
4	HASINA SHEK	Mastanvali	Minority	AGRICULTURE	AGRICULTURE IMPLEMENTS	Bank linkage	200000.00		
5	KARIMUR SHEK	Khajavali	Minority	AGRICULTURE	AGRICULTURE IMPLEMENTS	Bank linkage	200000.00		Died
6	MOULABHI SHEK	Adhamvali	Minority	AGRICULTURE	AGRICULTURE IMPLEMENTS	Bank linkage	200000.00		
7	MUNTHAJBE GAM SHEK	Abdhulbashar	Minority	AGRICULTURE	AGRICULTURE IMPLEMENTS	Bank linkage	200000.00		
8	PAREDH SHEK	Kaleasha	Minority	AGRICULTURE	AGRICULTURE IMPLEMENTS	Bank linkage	200000.00		
9	SHAKILA SHEK	Badeasa	Minority	AGRICULTURE	AGRICULTURE IMPLEMENTS	Bank linkage	200000.00		
10	SSSLARBHI SHEK	Emambudea	Minority	AGRICULTURE	AGRICULTURE IMPLEMENTS	Bank linkage	200000.00		
	Total						2000000		

Corpus calculation

i.SB A/c Balance Rs	124000.00	a. CCL loan O/s Rs.	0.00
ii.Loan O/s to Member Rs.	0.00	b.Unnathi loan O/s Rs.	0.00
iii. Deposits Rs.	0.00	c. Streenidhi Rs.	0.00
		d. CIF Rs.	0.00
A.Total(i+ii+iii)	124000.00	B.Total(a+b+c+d)	0.00

Total Corpus(A-B): 124000.00


SHG Stamp


SHG Leader Signature

P. Prameela
Community Co-Ordinator
DRDA - YSR Kranthi padham
Ballikurava Mandal

VO Stamp

చనిపోయినవారికి కూడా ఎంసిపి చేసిన లెటర్





సిసికి విఒఎల ద్వారా ఆన్‌లైన్‌లో ఆర్థిక లావాదేవీలు మచ్చుకు కొన్ని..

గ్రూపులో చనిపోయిన సభ్యురాలికి లోను..

ఈ మధ్యకాలంలో ఒక గ్రూపులో చనిపోయిన ఒక సభ్యురాలిని చూసుకోకుండా ఎంసిపి (మైక్రో క్రెడిట్ ప్లాన్) చేశారు. బ్యాంకు వారు దీన్ని గమనించి వెనక్కి పంపించారు. ఈ వ్యవహారం అంతా చూస్తూ ఉంటే సీసీ కావాలని లోను శాంక్షన్ చేసి ఆ సొమ్ము తమకు దక్కే విధంగా చేసుకుందేమోననే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అసలు గ్రూపు సభ్యుల సంతకాలు లేకుండా ఎంపీసీపై సిసి సంతకాలు పెట్టి పంపించారు. ఈ క్లస్టర్‌లోని అందరి పరిస్థితి ఇలానే ఉంది.

ఉన్నతాధికారుల చర్యలు ఏవీ..

ఏపీఎంకు తెలియజేసినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని పలువురు పేర్కొంటున్నారు. కార్యాలయంలోని పై అధికారులైన ఏపీఎం, ఏసీలు కూడా సీసీకే సపోర్టుగా ఉంటూ తమను తక్కువ చేసి మాట్లాడుతున్నారని బాధపడుతున్నారు. పై అధికారికి ఫిర్యాదు చేసిన తర్వాత రోజు ఆఫీస్‌కి వచ్చినప్పటి నుంచి తనపై ఏపిఎం, ఏసీలకు కంప్లైంట్ ఇస్తారా.. ఎవరెవరు ఇచ్చారో తెలుసు, వాళ్ల సంగతి చూస్తా అని వివోఏలను బెదిరించి మాట్లాడినట్లు చెబుతున్నారు. కొణిదెన సీసీ పర్చూరు ప్రమీల ప్రవర్తనతో తమకు చాలా ఇబ్బందికరంగా, అవమానకరంగా ఉన్నదని వివోఏలు వాపోతున్నారు.

ఆఫీస్‌కి రాకుండానే రిజిస్టర్‌లో సంతకాలు..

ఇటీవల కొణిదెన క్లస్టర్ సిసి పర్చూరు ప్రమీల సొంత పనులు చూసుకుంటూ ఒక వారం నుంచి ఆఫీస్‌కు రాలేదు. కనీసం ఆఫీసులోని పై అధికారికి లీవ్ లెటర్ ఇవ్వాలని కూడా లేకుండా తానే పై అధికారిని అనుకొని వారం తర్వాత ఆఫీస్ కొచ్చి ఆఫీస్‌కు రాని రోజులకు వచ్చినట్టుగా సంతకాలు చేసుకుంటుంది. పై అధికారి ఏపీఎం కూడా ఈమె వ్యవహార శైలిని చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు.

చోరీ కేసులో నిందితులు అరెస్టు

ప్రజాశక్తి-హనుమంతునిపాడు

బంగారు గొలుసు చోరీ చేసిన కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. రిమాండ్ నిమిత్తం వారిని కోర్టులో హాజరు పరిచారు. వివరాలిలా ఉన్నాయి. తన మెడలోని 20 గ్రాముల బంగారు గొలుసును దొంగలు లాక్కెళ్లారని మండలంలోని వీరారెడ్డిపల్లికి చెందిన ఆదిలక్ష్మమ్మ అనే మహిళ గతంలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. మే 26వ తేదీ వేకువజామున 2.30 గంటల సమయంలో హనుమంతునిపాడు మండలంలోని వీరారెడ్డిపల్లిలో తన ఇంటి వరండాలో మంచంపైన నిద్రిస్తుండగా గుర్తు తెలియని దొంగలు తన మెడలోని సుమారు 20 గ్రాముల బంగారు చైను లాక్కొని వెళ్లినట్లు ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆమె ఫిర్యాదు మేరకు హనుమంతునిపాడు పోలీసులు కేసు నమోదు చేసి ఉన్నతాధికారులకు తెలియపరిచారు. ఎస్పీ మల్లికా గర్గ్ ఉత్తర్వుల మేరకు కనిగిరి ఎస్‌డిపిఓ ఆర్ రామరాజు ఆధ్వర్యంలో కనిగిరి సిఐ జి శివరామకృష్ణారెడ్డి పర్యవేక్షణలో నిందితుల ఆచూకీ కోసం హనుమం తునిపాడు ఎస్ఐ జి కృష్ణ పావని, కనిగిరి ఎస్ఐ డి ప్రసాద్, పిసిపల్లి ఎస్ఐ ఎ నాగేశ్వరరావు, పోలీసు సిబ్బందితో కలిపి మొత్తం మూడు టీములుగా ఏర్పాటు చేశారు. శుక్రవారం ఉదయం 10.30 గంటలకు మండలంలోని వేములపాడు గ్రామంలోని గుడిపాటిపల్లికి వెళ్లే అడ్డరోడ్డు వద్ద నిందితులు పొదిలి పట్టణంలోని చిన్నచెరువుకు చెందిన పొన్నర్సు అలియాస్ పోలా చిన్న అంజయ్య, పొన్నర్సు అలియాస్ పోలా నరేష్, పొన్నర్సు అలియాస్ పోలా యేసు అలియాస్ యేసుదాసులను అరెస్ట్ చేసి వారి వద్ద ఉన్న చోరీ సొత్తు బంగారు చైన్‌ను, వారు దొంగతనానికి ఉపయోగించిన మోటార్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టుకు హాజరుపరిచినట్లు పోలీసులు తెలిపారు.

మాదకద్రవ్యాలను అరికట్టాలి : ఎస్ఐ

ప్రజాశక్తి-పంగులూరు

మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టి, యువతను సరైన మార్గంలో పయ నించే విధంగా చేసేందుకు ప్రజలంతా సహకరించాలని రేణింగవరం ఎస్ఐ తిరుపతిరావు కోరారు. శుక్రవారం రాత్రి మండలం లోని ముప్పవరం గ్రామంలో జాతీయ రహదారి పక్కన ప్రజలతో ఆయన మాట్లాడారు. బాపట్ల ఎస్పి వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు విలేజ్ విజిటింగ్ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. మాదకద్రవ్యాల విని యోగంతో యువత పెడమార్గం పయ నిస్తుందని, సైబర్ నేరాలకు అలవాటు పడి బంగారు భవిష్యత్తును సర్వనాశనం చేసుకుంటున్నారని తిరుపతి రావు చెప్పారు. చదువుకొని మంచి భవిష్యత్తును చూసుకోవలసిన యువత, చెడు మార్గం వైపు



స్థానికులతో మాట్లాడుతున్న ఎస్ఐ

పయనిస్తూ, భవిష్యత్తు నాశనం చేసుకుంటున్నారని, వారిని సరైన మార్గంలో పెడితే దేశం గర్వించదగ్గ పౌరులు అవుతారని అన్నారు. యువత పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. నేరాల నియంత్ర ణలో సీసీ కెమెరాల ప్రాముఖ్యత గురించి అవగాహన కలిగించారు. ఎనిమిది సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు సరైన ప్రాంతాలను గుర్తించామని, త్వరలో వాటిని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసి ప్రజల కదలికలను గమనిస్తామని తెలిపారు.

మృతదేహాన్ని మూటకట్టి పడేశారు

అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

పుల్లలచెరువు మండలం ముటుకుల గ్రామంలో దారుణం చోటు చేసుకుంది. చెన్నైకి మట్టి పనులు కోసం వెళ్లిన ఉప్పు శ్రీను(35) శుక్రవారం అర్ధరాత్రి సమయంలో ముటుకులలోని తన ఇంటి ముందు విగత జీవిగా పడి ఉండటం చూసి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఉప్పు శ్రీను అనే వ్యక్తి బతుకుదెరువు కోసం మట్టి పనులు చేసుకునేందుకు ఇటీవల చెన్నైకి వలస వెళ్లాడు. అయితే అక్కడ ఏమి జరిగిందో ఏమో గుర్తు తెలియని వ్యక్తులు శ్రీను మృతదేహాన్ని అర్ధరాత్రి సమయంలో ముటుకుల గ్రామంలోని ఆయన ఇంటి ముందు పడేసి వెళ్లారు. మృతదేహం వద్ద రూ. 35 వేల నగదుకు పడేసి వెళ్లారు. మృతదేహంపై పలు చోట్ల రక్త గాయాలు ఉన్నాయి. దీంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీహరి తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహానికి స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మార్కాపురం డిఎస్‌పి వీరరాఘవరెడ్డి, యర్రగొండపాలెం సిఐ



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

మారుతీకృష్ణ ఘటనా స్థలాన్ని సందర్శించారు. మృతుడి కుటుంబ సభ్యులు, గ్రామస్తులతో మాట్లాడారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.



తిమ్మాయపాలెం గ్రామంలో వరిగడ్డి వాములు దగ్ధమవుతున్న దృశ్యం

వరి గడ్డి వాములు దగ్ధం

ప్రజాశక్తి-అద్దంకి: వరి గడ్డివాములు ప్రమాదవశాత్తు కాలిపోయాయి. దాదాపు ఏడుగురు రైతులకు చెందిన 13 ఎకరాల పశుగ్రాసమంతా కాలి బూడిదయిన ఘటన మండలంలోని తిమ్మాయపాలెం గ్రామంలో శుక్రవారం జరిగింది. గడ్డివాముల్లో మంటలు చెలరేగిన అనంతరం స్థానికులు గమనించి యజమానులకు, అద్దంకి అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ అధికారులు మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అసలే పశుగ్రాసం కొరతతో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న క్రమంలో ఇలా దగ్ధం కావడంతో రైతులు కన్నీటి పర్యంత మయ్యారు. గ్రామానికి చెందిన అడుసుమల్లి మురళి, కమ్మ శ్రీను, వెంకటేశ్వర్లు, గండు చిరంజీవి, నర్రా గోపాల్‌లకు చెందిన వరిగడ్డి పూర్తిగా అగ్నికి ఆహుతి అయింది. మంటల్లో బూడిదైన వరిగడ్డి వాముల విలువ దాదాపు రూ.రెండు లక్షల పైన ఉండవచ్చునని రైతులు తెలిపారు.



విద్యుత్ షాక్‌తో మృతిచెందిన గేదెలు

విద్యుద్ఘాతానికి మూడు గేదెలు మృతి

ప్రజాశక్తి-కొమరోలు

విద్యుత్ షాక్‌తో మూడు గేదెలు మృతిచెందాయి. ఈ ఘటన కొమరోలు మండలం చింతరపల్లె పంచాయతీ పరిధిలోని గోపానిపల్లె వద్ద చోటు చేసుకుంది. గురువారం సాయంత్రం ఈదురుగాలులు వీచాయి. దీంతో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. శుక్రవారం ఉదయం మేతకోసం వెళ్లి గేదెలకు విద్యుత్ తీగలు తగలడంతో షాక్‌కు గురై అక్కడిక్కడే మృతిచెందాయి.



మరమ్మతులకు గురైన బోరు ఇదే...

మరమ్మతులకు గురైన బోరు ప్రజలకు తాగునీటి ఇక్కట్లు

ప్రజాశక్తి -సిఎస్ పురం రూరల్

మండల పరిధిలోని డిజిపేట బీసీ కాలనీలో తాగునీటి బోరు చాలా కాలంగా మరమ్మతులకు గురైంది. దాని మరమ్మతుల గురించి అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో ప్రజలకు ఇక్కట్లు తప్పడం లేదు. బోరు సమీపంలో 80 కుటుంబాల వారు ఉన్నారు. గతంలో ఈ బోరు వారందరికీ ఎంతగానో ఉపయోగపడేది. ఈ బోరు రెండేళ్ల క్రితం మమ్మతులకు గురైంది. అప్పటి నుంచి మరమ్మతులు చేపట్టలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బోరుకు మరమ్మతులు చేయించి నీటి సమస్యను పరిష్కరించాలని బీసీ కాలనీ వాసులు కోరుతున్నారు.



'గడపగడపకూ..'లో మంత్రి, కలెక్టర్

పథకాలతో జీవన ప్రమాణాలు మెరుగు

ప్రజాశక్తి-త్రిపురాంతకం

రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథ కాలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పడ్డాయని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ దినేష్‌కుమార్‌తో కలిసి త్రిపురాంతకంలో శుక్రవారం మంత్రి సురేష్ పర్యటించారు. వారికి గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన మంత్రి నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కలెక్టర్ దినేష్ కుమార్, సబ్ కలెక్టర్ సేతు మాధవన్, డిఎల్‌డివో బివిఎన్ సాయికుమార్, ఎంపిపి కోట్ల సుబ్బారెడ్డి, జడ్పిటిసి మాకం జాన్‌పాల్, మాజీ ఎంపిపి ఆళ్ల ఆంజనేయరెడ్డి, మండల కన్వీనర్ సింగారెడ్డి పోలిరెడ్డి, సర్పంచ్ పొన్నా వెంకటలక్ష్మి, ఎంఈవో తులసి మల్లిఖార్జున నాయక్ పాల్గొన్నారు.



లబ్ధిదారులకు రుణాలు అందజేస్తున్న సర్పంచ్ రవికిరణ్మయి

పది మంది లబ్ధిదారులకు రుణం

ప్రజాశక్తి-భట్టిప్రోలు: భట్టిప్రోలు గ్రామ పంచాయతీలోని జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలు చేపట్టేందుకు ఒక్కొక్క లబ్ధిదారునికి రూ.35 వేల చొప్పున రుణాన్ని గ్రామ సర్పంచ్ దారా రవికిరణ్మయి చేతుల మీదుగా గురువారం అందజేశారు. బేసిమెంట్ వేసుకునేందుకు డ్వాక్రా గ్రూప్ ద్వారా ఈ రుణాన్ని అందజేసి నట్లు సర్పంచ్ పేర్కొన్నారు. గృహ నిర్మాణం చేపడితే ప్రభుత్వం నుంచి బిల్లులు మంజూరు అవుతాయని, వాటి ద్వారా గృహాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లవచ్చునని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కో-ఆప్షన్ సభ్యులు షేక్ సలీమ్, ఏపిఎం శ్రీమన్నారాయణ, సిసి హనోక్, కార్యదర్శి శ్రీనివాసరావు, నాయకులు చెన్నయ్య, శిరీష ఉన్నారు.

నూరు శాతం సబ్సిడీతో పండ్ల మొక్కలు

ప్రజాశక్తి-సంతమాగులూరు

ఉపాధి హామీ పథకంలో సన్న, చిన్న కారు ఐదు ఎకరాల లోపు పొలం కలిగిన రైతులకు 100 శాతం సబ్సిడీతో ఉచితంగా పండ్ల తోట మొక్కలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఏపీవో బాలకృష్ణ నాయక్ తెలిపారు. పండ్ల తోట రకాలైన నిమ్మ, మామిడి, సపోటా, బత్తాయి, కొబ్బరి, డ్రాగన్ ఫ్రూట్, తైవాన్ జామ, గులాబీ, మల్లె, సీతాఫలం, యాపిల్ బేర్, దానిమ్మ, నేరేడు, మునగ మొదలగు రకాల మొక్కలను రైతులకు ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. తగు సమాచారం కోసం, ఎంపీడీవో, ఏపీవో లేదా గ్రామ పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్ వద్ద తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని మండలంలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

గ్రీన్ బెల్ట్‌లో ఆక్రమణలు తొలగింపు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్: స్థానిక రాంనగర్ ఒకటో లైన్ నుంచి 10వలైన్ వరకు ఉన్న రామ్‌నగర్ గ్రీన్ బెల్ట్ ఆక్రమణలను, రోడ్డు మార్జిన్ ఆక్రమణలను నగరపాలక సంస్థ టౌన్‌ప్లానింగ్ సిబ్బంది శుక్రవారం తొలగించారు. జగనన్న హరిత నగరాలలో భాగంగా నెడ్ క్యాప్ నిధులతో ఆ ప్రాంతాన్ని సుందరంగా తీర్చిదిద్ద నున్నట్లు, మోడల్ రోడ్డు ఏర్పాటు చేయనున్నట్లు కార్పొరేషన్ అధికారులు ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమాన్ని అసిస్టెంట్ సిటీ ప్లానర్ కె వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో..

నిర్లక్ష్యం వహిస్తే ఆందోళన

ఏపిజేఏసి అమరావతి స్టేట్ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-బాపట్ల రూరల్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న బొప్పరాజు వెంకటేశ్వర్లు, ఉద్యోగ సంఘాల నాయకులు

ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేస్తున్న పోరాటాల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తే పోరాటాన్ని ఉధృతం చేస్తామని ఉద్యోగ సంఘాల నాయకులు అన్నారు. జూన్ 8న గుంటూరులో ఏపిజెఏసి అమరావతి ఆధ్వర్యంలో చేపట్టదలచిన నాలుగో ప్రాంతీయ సదస్సును జయప్రదం చేయాలని బాపట్ల కలెక్టర్ కార్యాలయం వద్ద పోస్టర్, కరపత్రాలను రిలీజ్ చేశారు. ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులు సృష్టిస్తున్నా 85 రోజులుగా గాంధేయ పద్ధతిలో చేస్తున్న పోరాటాలు కనిపించకపోతే జూన్ 10న రాష్ట్ర కార్యవర్గంలో చర్చించి భవిష్యత్ కార్యక్రమాలన్ని ఏఐటియుసి, సిఐటియు కార్మిక సంఘాలతో కలిసి తప్పనిసరి పరిస్థితులలో ప్రత్యక్ష కార్యాచరణకు పూనుకోకతప్పదని, దానికి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందని ఏపిజేఏసి అమరావతి స్టేట్ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, బాపట్ల జిల్లా జెఏసి చైర్మన్ సిహెచ్ సురేష్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 85 రోజుల ఉద్యమం వలన ఉద్యోగులకు రావాల్సిన బకాయిలలో సూమారు రూ.6,000 కోట్లు సాధించుకున్నాం. కారుణ్య నియామాకాలు సాదించుకున్నాం, ఆర్టీసి ఉద్యోగుల సమస్యలు కొన్ని పరిష్కరించుకున్నాం. కొత్త జిల్లాల్లో హెచ్ఆర్ఏ పెంపుదల, కొంతమందికి టిఏలు, కొన్ని డిపార్టుమెంటు ఉద్యోగులకు ఎర్న్‌డ్ లీవ్‌ల డబ్బులు పడుతున్నాయని అన్నారు. సిపిఎస్ ఉద్యోగులకు సంబంధించి ప్రభుత్వం వాడుకున్న డబ్బులు రూ.2,400 కోట్లు ఇప్పించుకోగలిగాం.. ఇదంతా ఈ 85 రోజుల ఉద్యమ ఫలితంగానే సాధించుకోగలిగామని ఆయన తెలిపారు. ఇంకా ఉద్యోగులకు రావల్సిన వాటిలో పిఆర్‌సి, డిఏ బకాలు, పెండింగు డిఏలలో ఒకటి ప్రకటించినప్పటికీ ఇంకా రెండు డిఏలు రావాల్సి ఉందని, వీటితో పాటు రెవెన్యూ, ఆర్టీసి, మున్సిపల్, గ్రామవార్డు సచివాలయ ఉద్యోగులు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగు ఉద్యోగుల సమస్యలు ఇంకా వివిధ డిపార్టు ఉద్యోగులకు సంబంధించిన సమస్యలు పరిష్కారం కావల్సి ఉందన్నారు. ఏది ఏమైనప్పటికీ సిఎస్‌కు ఇచ్చిన 50 పేజీల మెమోరాండంలో సమస్యలు పరిష్కారంపై స్పష్టత ఇచ్చేంతవరకు ఉద్యమం కొనసాగిస్తామని ఎన్‌టీఆర్ జిల్లా సెక్రటరీ జెనరల్ ఎం రామకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపిజేఏసి అమరావతి బాపట్ల జిల్లా చైర్మన్ సిహెచ్ సురేష్ బాబు, సెక్రెటరీ జనరల్ టి రజనీకాంత్, విఆర్‌వో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఏ సాంబశివరావు, స్టేట్ క్లాస్ 4 ఎంప్లాయిస్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ మల్లేశ్వరరావు, జిల్లా జేఏసి కో చైర్మన్ వై శ్రీనివాసరావు, కో ఆపరేటివ్ నాయకులు మురళి మోహన్‌రెడ్డి, రెవెన్యూ సంఘం జిల్లా కోశాధికారి బి ఓంకార్, డివిజన్ నాయకులు చంద్రశేఖర్, పి సురేష్‌బాబు, కె లక్ష్మీనారాయణ తదితర నాయకులతో పాటు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పశు బీమా పథకంలో ప్రభుత్వమే పరిహారమివ్వాలి

గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి కిలారి పెద్దబ్బాయి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్



జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి బేబిరాణికి వినతి అందిస్తున్న నాయకులు

పశు బీమా పథకంలో ఇన్సూరెన్స్ కంపెనీ కాకుండా ప్రభుత్వమే పరిహారం చెల్లించే బాధ్యత తీసుకోవాలని ఎపి గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి కిలారి పెద్దబ్బాయి డిమాండ్ చేశారు. స్థానిక ఎల్‌బిజి భవన్‌లో ఎపి గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘం జిల్లా కమిటీ సమావేశం శుక్రవారం జరిగింది. సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కిలారి పెద్దబ్బాయి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం వచ్చి నాలుగేళ్ళు అవుతున్నా గొర్రెల కాపర్లకు చేసిందేమీ లేదని అన్నారు. ఉన్న పథకాలను ఎత్తివేసి గొర్రెల కాపర్లను తీవ్రంగా నష్టపరుస్తుందని దుయ్యబట్టారు. వైఎస్ఆర్ పశు నష్ట పరిహార పథకం రద్దు చేయటం, దాని స్థానంలో పశు బీమా పథకాన్ని తేవటం ద్వారా ప్రభుత్వం తన బాధ్యత నుంచి తప్పుకొని న్యూ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీకి అప్పగించటం సరైంది కాదని అన్నారు. గతంలో ఈ కంపెనీ అనేక సాంకేతిక కారణాలతో క్లెయిమ్స్ పరిష్కరించక రైతులను ఇబ్బందులకు గురి చేసిందన్నారు. ఈ పథకం నుంచి న్యూ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీని తప్పించాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి తోట తిరుమలరావు మాట్లాడుతూ బీమా పథకంలో గొర్రె ఖరీదు 6 వేలుగా నిర్ణయించారని, రూ.10 వేలకు పెంచాలన్నారు. నట్టల నివారణ మందులు పంపిణీ వైసిపి ప్రభుత్వం వచ్చిన తరువాత సంవత్సరానికి ఒక్కసారే ఇస్తున్నారని, 3 సార్లు ఇవ్వాలని అన్నారు. పశు నష్టపరిహారం పెండింగ్ నిధులు వెంటనే విడుదల చేయాలని కోరారు. అనంతరం సమస్యల పరిష్కారాన్ని కోరుతూ వినతిపత్రాన్ని జిల్లా పశు సంవర్ధక అధికారి బేబీరాణికి అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు కె జయరాం, కిలారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆంధ్రుల సత్తా చాటిన 'దుగ్గిరాల'

ప్రజాశక్తి-బాపట్ల



దుగ్గిరాల విగ్రహానికి పూలమాల వేస్తున్న ఆర్డీవో రవీందర్

చీరాల-పేరాల పన్నుల నిరాకరణ ఉద్యమానికి నాయకత్వం వహించి జాతీయ స్థాయిలో దుగ్గిరాల గోపాల కృష్ణయ్య ఆంధ్రుల సత్తా చాటి తెలుగువారికి ప్రత్యేక గుర్తింపు తెచ్చారన్నారు. బాపట్ల ఆర్డిఓ గంధం రవీందర్ అన్నారు. శుక్రవారం దుగ్గిరాల 135వ జయంతి సందర్భంగా బాపట్ల తహాశీల్దారు కార్యాలయ ఆవరణలో గోపాలకృష్ణ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ వేలాదిమంది ప్రజలను 11 నెలల పాటు ఒకే తాటిపై నడిపించి చీరాల పేరాల ఉద్యమానికి మరింత ఊపు తెచ్చారన్నారు. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి పదవిని చేపట్టిన తొలి ఆంధ్రుడిగా దుగ్గిరాల జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించారన్నారు. రామదండును ఏర్పాటు చేసి ఎంతోమందిని స్వాతంత్రోద్యమంలో భాగస్వాములుగా చేశారు. ఆయన చూపిన తెగువ, సాహసం అనితర సాధ్యమని దుగ్గిరాల ఉద్యమ స్ఫూర్తిని రవీందర్ కొనియాడారు. దుగ్గిరాల బాపట్ల తాలూకా కార్యాలయంలో గుమస్తాగా పనిచేయడం గర్వకారణమన్నారు. ఆయన నడయాడిన ప్రాంతానికి ఆంధ్రరత్న ప్రాంగణం నామకరణం చేసిన ఫోరం ఫర్ బెటర్ కార్యదర్శి పిసి సాయిబాబును ఆర్డీవో అభినందించారు. కార్యక్రమంలో ఫోరం కార్యదర్శి డాక్టర్ పిసి సాయిబాబు, తహాశీల్దారు సిహెచ్ సుధా రాణి, యూవీ రామారావు, బండికళ్ల బాబూరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కర్లపాలెం పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ

ప్రజాశక్తి-కర్లపాలెం



స్థానిక పోలీసులతో మాట్లాడుతున్న ఎస్‌పి వకుల్ జిందాల్

గంజాయి, ఇతర అసాంఘిక కార్యకలాపాలు కట్టడికి పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అధికారులను ఆదేశించారు. వార్షిక తనిఖీలో భాగంగా శుక్రవారం ఉదయం జిల్లా ఎస్పీ బాపట్ల సబ్ డివిజన్ పరిధిలోని కర్లపాలెం పోలీస్ స్టేషన్‌ను తనిఖీ నిర్వహించారు. ముందుగా సిబ్బంది వద్ద నుంచి గౌరవ వందనం స్వీకరించారు. స్టేషన్ పరిసరాలను, ఎస్‌హెచ్‌ఓ, రైటర్, కంప్యూటర్ గదులను, కేస్ ప్రాపర్టీ భద్రపరిచిన గదిని పరిశీలించారు. కేసు ప్రాపర్టీకి సంబంధించిన వివరాలు ఎప్పటికప్పుడు రికార్డులో నమోదు చేయాలన్నారు. జిల్లా ఎస్పీ కర్లపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామ/వార్డు సచివాలయ మహిళ పోలీసులు, సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. సిబ్బంది శాఖాపరమైన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గంజాయి, ఇతర అసాంఘిక కార్యకలాపాలు కట్టడికి పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. స్టేషన్ పరిధిలో గతంలో గంజాయి సంబంధిత కేసుల్లో ముద్దాయిలుగా ఉన్న వారిపై నిఘా ఉంచాలన్నారు. వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలన్నారు. తదనంతరం స్టేషన్లో పనితీరును చూసి ఎస్ఐ శివయ్యను అభినందించారు. అనంతరం జిల్లా ఎస్పీ స్టేషన్ ఆవరణలో మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో బాపట్ల డిఎస్‌పి టి వెంకటేశ్వర్లు, బాపట్ల రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి వేణుగోపాల్‌రెడ్డి, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ ఏ శ్రీనివాస్, సిసి హరికృష్ణ, కర్లపాలెం పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ శివయ్య, కర్లపాలెం పోలీస్ స్టేషన్ సిబ్బంది మరియు గ్రామ/వార్డు సచివాలయ మహిళ పోలీసులు పాల్గొన్నారు.

కమిషనర్ ఉద్యోగ బాధ్యతలు పొడిగింపు

- డిప్యూటేషన్‌ను మరో ఏడాది పొడిగిస్తూ

జీవో విడుదల చేసిన ప్రభుత్వం

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

ఒంగోలు నగరపాలక సంస్థ కమిషనర్‌గా ఎం. వెంకటేశ్వరరావు ఉద్యోగ బాధ్యతలను మరో ఏడాది పాటు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం జీవో విడుదల చేసింది. కమిషనర్‌గా మరో ఏడాదిపాటు డిప్యూటేషన్‌పై కొనసాగాలని జీవో ఆర్‌డి నబర్ 350ని విడుదల చేసింది. పంచాయతీరాజ్ డిపార్ట్‌మెంట్‌లో డివిజనల్ లెవల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (డిఎల్‌డిఒ)గా ఉన్న వెంకటేశ్వరరావును ప్రభుత్వం గత ఏడాది మే 20న ఒంగోలు కార్పొరేషన్ కమిషనర్‌గా ఏడాది పాటు డిప్యూటేషన్‌పై నియమించింది. ఆయన డిప్యూటేషన్ కాలం ఈ ఏడాది మే20తో ముగిసింది. ఈనేపథ్యంలో ఆయన ఉద్యోగ కాలన్నీ మరో ఏడాది పాటు కొనసాగిస్తూ తాజాగా శుక్రవారం ఉత్తర్వులు వచ్చాయి. వెంకటేశ్వరరావు కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి నగరంలో పారిశుధ్యం నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రతిరోజు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పారిశుధ్య సిబ్బందికి



ఎప్పటికప్పుడు సూచనలు చేస్తూ పారిశుధ్య సంబంధిత ఫిర్యాదులను తగ్గించారు. తాగునీటి సరఫరాలో లోపాలను కూడా సరిచేసి, ఆ వ్యవస్థను గాడిలో పెట్ట గలిగారు. సచివాలయాలపై పట్టు సాధించారు. వారంలో కనీసం మూడు, నాలుగు సచివాలయాలను తనిఖీచేస్తూ సచివాలయ సిబ్బంది పనితీరు, సేవలను మెరుగుపరచడంపై దృష్టి పెట్టి పనిచేశారు. నగరంలో ఆయన ఏడాది పాలనలో సుమారు రూ.110 కోట్ల విలువైన రోడ్లు, కాలువల నిర్మాణాలకు అనుమతులు ఇచ్చారు. అందులో మెజారిటీ పనులు వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయి. నగరంలోని అన్నీ డివిజన్‌లలో పర్యటించారు. ఏ ప్రాంతంలో ఏ సమస్య ఉందనే విషయంపై అవగాహన పెంచుకున్నారు. పర్యటనకు వెళ్లిన ప్రతి డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్లను భాగస్వామ్యులను చేస్తూ అక్కడ సమస్యలపై వారితో చర్చించడం వెంకటేశ్వరరావు ప్రత్యేకత. ఈ క్రమంలో కార్పొరేటర్లలతో ఆయన సత్సంబంధాలను కొనసాగించారు. కార్పొరేషన్ పాలనలో చిన్నచిన్న లోపాలు మినహ సెక్షన్ హెడ్‌లను సమన్వయం చేసుకొని ముందుకు సాగారు. పన్నులు వసూలు , యూజర్ ఛార్జీలు వసూలు చేయించే విషయంలో సిబ్బందిని ముందుండి నడిపారు. ప్రత్యేకించి స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డికి అందుబాటులో ఉంటూ, నగర అభివృద్ధి విషయాలను ఎప్పటికప్పుడు ఆయన దృష్టికి తీసుకువెళ్లి ఆయన మన్ననలు పొందగలిగారు. ఎమ్మెల్యే చేపట్టిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా ప్రణాళిక బద్ధంగా పనిచేశారు. మేయర్‌తోనూ సఖ్యతగా వ్యవహరించారు. జిల్లాకు చెందిన పురపాలకశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్‌తోనూ మంచి సంబంధాలే కొనసాగించారు. దీంతో రెండో ఏడాది కూడా ఆయన్నే కమిషనర్‌గా కొనసాగించాలని స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి చేసిన సిఫార్సులను ప్రభుత్వం పరిగణలోకి తీసుకున్నట్లు తెలిసింది. ఈ క్రమంలోనే ఆయన డిప్యూటేషన్ కాలన్నీ పొడగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో కార్పొరేషన్ కార్యాలయ సిబ్బంది, పలువురు కార్పొరేటర్లు శుక్రవారం వెంకటేశ్వరరావును కలిసి అభినందనలు తెలిపారు.




శంకుస్థాపనలో మేయర్ సుజాత

అంబేద్కర్ ఆడిటోరియం నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

స్థానిక పదో డివిజన్ కొప్పోలు పరిధిలోని అంబేద్కర్ నగర్‌లో అంబేద్కర్ ఆడిటోరియం నిర్మాణానికి నగర మేయర్ గంగాడ సుజాత శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా మేయర్ మాట్లాడుతూ దాదాపు రూ.92 లక్షలతో అంబేద్కర్ ఆడిటోరియాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. అందుకు సంబంధించి ముందుగా రూ.40 లక్షలు మంజూరు చేసినట్లు వివరించారు. అంబేద్కర్ ఆడిటోరియం నిర్మాణం మంచి పరిణామమని చెప్పారు. ఈ కార్యక్రమంలో పదో డివిజన్ కార్పొరేటర్ బెంగళూరు నరసయ్య, 16వ డివిజన్ కార్పొరేటర్ నాగభూషణం, వైసిపి నాయకుడు నాని, కార్పొరేషన్ సిబ్బంది, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ట్యాబ్‌న ప్రారంభిస్తున్న ఎంపిపి, జడ్‌పిటిసి

హాస్పిటల్‌లో ల్యాబ్ ప్రారంభం

ప్రజాశక్తి-దర్శి

హాస్పిటల్ అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా తాళ్ళూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ల్యాబ్ సౌకర్యాన్ని తాళ్లూరు ఎంపిపి తాటికొండ శ్రీనివాసరావు, జిల్లా వైద్య విద్యా కమిటీ సభ్యులు, జడ్‌పిటిసి మారం వెంకటరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రయివేటు హాస్పిటల్స్ కంటే ప్రభుత్వ హాస్పిటల్స్‌లో అన్ని పరికరాలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఖాదర్‌మస్తాన్‌బి, సర్పంచి చార్లెస్ సర్జన్, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణంపై ప్రజలకు అవగాహన

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

లైఫ్‌స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా నగరపాలక సంస్థ కమిషనర్ ఎం. వెంకటేశ్వరరావు శుక్రవారంపోతురాజు కాలువ కట్ట పరిసర ప్రాంతాల్లోని ప్రజలకు పర్యావరణంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం 120 మైక్రాన్ల కన్న తక్కువ సామర్థ్యం ఉన్న ప్లాస్టిక్ కవర్లను రద్దు చేసినట్లు తెలిపారు. అలాంటి కవర్లను ఎవరైనా అమ్మినా, కొనినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్లాస్టిక్ భూమిలో కలవడానికి కొన్ని వందల సంవత్సరాలు పడుతోందని వివరించారు. దీనివల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందన్నారు. ప్రజలు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని కోరారు. లైఫ్‌స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ భాగంగా ప్రజలు తమ వ్యక్తిగత జీవనశైలిలో మార్పులు తెచ్చుకోవాలన్నారు. అనంతరం ప్రజల చేత మిషన్ లైఫ్‌స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్ మనోహర్‌రెడ్డి, శానిటరీ సూపర్ వైజర్ ఎన్.పిచ్చయ్య, స్థానిక కార్పొరేటర్ అంగిరేకుల గురవయ్య, కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

సచివాలయంలో తనిఖీ

స్థానిక తూర్పు క్రిష్టియన్ పాలెం సచివాలయాన్ని నగరపాలక సంస్థ కమిషనర్ వెంకటేశ్వరరావు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బంది హాజరు పట్టి, మూమెంట్ రిజిస్టర్‌ను పరిశీలించారు. రిజిస్టర్‌లు సక్రమంగా వినియోగించడంలేదని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బంది ఏకరూప దుస్తులు ధరించాలని సూచించారు. సచివాలయ పరిధిలో జరుగుతున్న వివిధ రకాల సర్వేలను వేగవంతం చేయాలని సూచించారు.

ఎంఎన్‌సి ఉద్యోగాలకు

'ప్రకాశం' విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి -కందుకూరు

ఉద్యోగ నియామకాల సంక్షోభ సమయంలో పలువురు ప్రకాశం ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు మల్టీ నేషనల్ ఎంఎన్‌సిలకు ఎంపికై రికార్డు సృష్టించినట్లు టెక్నికల్ డైరెక్టరు కె.విజయ్ శ్రీనివాస్ తెలిపారు. టిసిఎస్, విప్రో, హెక్సా వేర్ తదితర కంపెనీలు ఆన్ లైన్ ద్వారా నిర్వహించిన పరీక్షలు, ఇంటర్వ్యూలలో 50 మందికి పైగా విద్యార్థులు ఆఫర్ లెటర్స్ పొందినట్లు ఆయన పేర్కొన్నారు. ఎంపికైన వారు రెండు లక్షల నుంచి ఏడు లక్షల వార్షిక వేతనం పొందనున్నట్లు విజయ్ వివరించారు. వచ్చే వారంలో విప్రో కాంపస్ ఇంటర్వ్యూ నిర్వహణకు ఆమోదించినట్లు ఆయన తెలిపారు. గ్లోబల్ యుఎస్ టెక్నాలజీస్‌కు ఎంపికైన కాశయ్య వార్షిక వేతనం రూ. 7 లక్షలని డాక్టర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. మెకానికల్ బ్రాంచి నుంచి యుఎస్ టెక్నాలజీకి ఎంపిక కావడం పట్ల హెచ్ఒడి జివి. పున్నారావు హర్షం వ్యక్తం చేశారు. ఎంతటి సంక్షోభ సమయంలోనైనా తమ కాలేజీ విద్యార్థులు ఎంఎన్‌సిలకు ఎంపికయ్యేందుకు అవసరమైన సాంకేతిక శిక్షణ నిరంతరం అందించడమే తమ విజయ రహస్యమని టెక్నికల్ డైరెక్టర్ తెలిపారు. గతేడాది సుమారు 400 మంది ఎంఎన్‌సిలకు ఎంపికైనట్లు తెలిపారు. అదే బాటలో డిగ్రీతో పాటు ఆఫర్ లెటర్ అభయాన్ని ప్రకాశం సాధిస్తుందని కరస్పాండెంట్ కంచర్ల రామయ్య ఆత్మవిశ్వాసం వ్యక్తం చేశారు.



టెక్నికల్ డైరెక్టర్ విజయ్

జాతీయస్థాయి పోటీలకు పాకల విద్యార్థిని

ప్రజాశక్తి -శింగరాయకొండ



ఎస్‌జిఫ్ యు-19 బాలికల జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు పాకల విద్యార్థిని వాయల అపర్ణ ఎంపికైనట్లు కోచ్ పిల్లి హజరత్తయ్య తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ ట్రిపుల్ జంప్‌లో అపర్ణ ద్వితీయ స్థానంలో నిలిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఈనెల 6 నుంచి 9 వరకూ మధ్యప్రదేశ్ లోని భోపాల్‌లో నిర్వహిస్తున్న జాతీయ అథ్లెటిక్స్ పోటీలలో అపర్ణ పాల్గొనున్నట్లు ఆయన తెలిపారు. అపర్ణ శింగరాయకొండ గవర్నమెంట్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యను పూర్తి చేసింది. పాకల హైస్కూల్ పూర్వ విద్యార్థిని. కోచ్ పి. హజరత్తయ్య పర్యవేక్షణలో అపర్ణ శిక్షణ పొంది జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా అపర్ణ మాట్లాడుతూ తాను అథ్లెటిక్స్ జాతీయ స్థాయిలో ఎంపిక కావడానికి సహకరించిన కోచ్ పి.హజరత్తయ్య, జిల్లాస్కూల్ గేమ్స్ సెక్రటరీ ఆదినారాయణ, గవర్నమెంట్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఇనకొల్లు శ్రీనివాసులు, కళాశాల సిబ్బందికి ధన్యవాదాలు తెలియపరిచింది. ఈ సందర్భంగా గ్రామస్తులు ,ఉపాధ్యాయులు అపర్ణకు అభినందనలు తెలిపారు.



ఎడ్ల పోటీలను ప్రారంభిస్తున్న అశోక్‌రెడ్డి

ఉత్సాహంగా ఎడ్ల పోటీలు

ప్రజాశక్తి- అర్ధవీడు

మండల పరిధిలోని నాగులవరం గ్రామంలోనున్న శ్రీ నెమలిగుండ్ల రంగనాయక స్వామి ఆలయ ముఖద్వార ప్రారంభోత్సవం, శ్రీ పోలేరమ్మ తల్లి, పోతురాజు స్వామి వార్ల విగ్రహాలు, బొడ్డురాయి ప్రతిష్టా ప్రతిష్ట మహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో టిడిపి గిద్దలూరు నియోజక వర్గ ఇన్‌ఛార్జి ముత్తుముల అశోక్ రెడ్డి పాల్గొన్నారు. స్వామివార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎడ్లపోటీలను ప్రారంభించారు. ఈ పోటీలు ఉత్సహంగా సాగాయి. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-అర్ధవీడు

33 కెవి విద్యుత్‌లైన్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు ఎఇ నారాయణ తెలిపారు. అందులో భాగంగా మండల పరిధిలోని మొహిద్దిన్ పురం విద్యుత్ సబ్ స్టేషన్, కొత్తూరు సబ్ స్టేషన్, అర్ధవీడు సబ్ స్టేషన్, పాపినేనిపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఉచిత వైద్యశిబిరం

గిద్దలూరు రూరల్ : మండల పరిధిలోని కొంగలవీడు పంచాయతీ కార్యాలయ ఆవరణలో గ్రామ సర్పంచి లక్ష్మీ ప్రసన్న,వైసిపి నాయకులు రాజా భూపాల్ ఆధ్వర్యంలో అరుణోదయ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా బిపి, షుగర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణకులు ప్రత్యేకంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు పాల్గొన్నారు.

నాన్ జ్యుడిషియల్ స్టాంపుల కొరత..!

క్రయ, విక్రయదారుల అవస్థలు

ప్రజాశక్తి-మార్కాపురం

అగ్రిమెంట్లు, అఫిడవిట్లు, బ్యాంకులు, తనఖా తదితర అవసరాలకు ఉపయోగపడే నాన్ జ్యుడిషియల్ స్టాంపుల కొరత తీవ్రంగా ఉంది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్టాంపులు లేకపోవడంతో ప్రజలు స్టాంపు వెండర్ల దగ్గరకు వెళుతున్నారు. వారి వద్ద కూడా అందుబాటులో లేకపోవడంతో తీవ్ర ఇక్కట్లకు ప్రజలు గురవుతున్నారు.

మార్కాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గత నాలుగు నెలలుగా నాన్ జ్యుడిషియల్ స్టాంపుల కొరత ఏర్పడింది. దీంతో రైతులు, క్రయ, విక్రయదారులు, విద్యార్థులు, వాటి అవసరం పడిన కొంతమంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్య రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని నెలలుగా ఉన్నా... సంబంధిత శాఖ పట్టించుకోవడం లేదని సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

భూముల కొనుగోలు చేసిన తరువాత ఒకరి పేరు మీద





ఉన్న భూమి మరొకరి పేరు మీదకు మార్చుకోవాలన్నా... ముందుగా అగ్రిమెంటు (ఖరారు) రాసుకోవాల్సి ఉంది. ఆ భూమి విలువ ఆధారంగా రూ. 50 లేదా రూ. 100 విలువ కలిగిన నాన్ జ్యుడిషియల్ స్టాంపులను వినియోగించుకోవాల్సి ఉంది. రెవెన్యూ, పంచాయతీ కార్యాలయాలు, సచివాలయాల్లో కొన్ని రకాల సేవలకు నాన్ జ్యుడిషియల్ స్టాంపులు అవసరం. స్టాంపులు పూర్తిగా లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. మార్కాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, స్టాంపు వెండర్స్ వద్ద రూ. 10, రూ. 20 స్టాంపులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. రూ. 10, రూ. 20ల స్టాంపులు విలువకు తగిన విధంగా ఎక్కువగా తీసుకోవాల్సి వస్తోంది. అన్ని పేజీల్లో రాయాల్సిన విషయాలు, ఉన్న వివరాలు పొందుపర్చాల్సి ఉంది. రూ. 50, రూ. 100 స్టాంపులు ఉంటే ఒక్క పేపరుతో పని పూర్తయ్యేది. రియల్ ఎస్టేట్ వ్యాపారులు, రైతులే కాదు... విద్యార్థులు నోటరీలు సమర్పించాలంటే రూ. 50 లేదా రూ. 100 స్టాంపులతో అఫిడవిట్ దాఖలు చేయాలి. నెలల తరబడి స్టాంపులు అందుబాటులో లేకపోవడంతో వాటి అవసరం కోసం ఎదురు చూసే వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మార్కాపురం కేంద్రంగా రోజుకు 200 తగ్గకుండా స్టాంపుల అమ్మకం జరిగేది. ప్రజల అవసరాలకు తగిన విధంగా రూ. 50, రూ. 100 విలువ కలిగిన నాన్ జ్యుడిషియల్ స్టాంపులను అందుబాటులో ఉంచాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి- జరుగుమల్లి

రాజమహేంద్రవరంలో నిర్వహించిన మహానాడులో యువగళం పథకం ద్వారా నిరుద్యోగులకు 20 లక్షల ఉద్యోగాలు కల్పన, యువగళం నిధి నుంచి నిరుద్యోగులకు రూ.3వేల నిరుద్యోగ భృతి ప్రకటిస్తూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు మేనిఫెస్టో విడుదల చేశారు. అందులో భాగంగా చంద్రబాబు నాయుడుకు



చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు



శింగరాయకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

కృతజ్ఞతలు తెలుపుతూ ఆయన చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. మండల పరిధిలోని కామేపల్లి గ్రామంలో దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు, దివంగత మంత్రి దామచర్ల ఆంజనేయులు విగ్రహాలకు టిడిపి మండల అధ్యక్షుడు పోకూరి రవీంద్రబాబు అధ్యక్షతన పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చంద్రబాబు నాయుడు చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కామేపల్లి గ్రామ మాజీ సర్పంచి ఏలూరి రాంబాబు, తెలుగు యువత అధ్యక్షుడు ఎనిమిరెడ్డి రమేష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నరాల సోమయ్య, కొమ్మలపాటి కృష్ణ, రావి నాగేశ్వరరావు, చెన్నారెడ్డి వెంకటేశ్వర్లు, దగ్గుమాటి సుబ్బారెడ్డి, బత్తిన పూర్ణ చంద్రరావు, కట్టా మణికుమార్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **పొన్నలూరు :** యువత భవిష్యత్తు టిడిపితోనే సాధ్యమని తెలుగు యువత మండల అధ్యక్షుడు బోయపాటి రమణారెడ్డి తెలిపారు. ఇటీవల రాజమహేంద్ర వరంలో నిర్వహించిన మహానాడులో యువగళం పథకం ద్వారా నిరుద్యోగులకు చంద్రబాబునాయుడు వరాల జల్లు కురిపించడాన్ని హర్షిస్తూ చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మాజీ అధ్యక్షులు మండవ ప్రసాద్, పిల్లి వెంకటనారాయణరెడ్డి, ఎంపిటిసి రామాంజనేయులు, బీసీసెల్ అధ్యక్షుడు కుర్రా మాల్యాద్రి, రైతు అధ్యక్షుడు కుంకు సురేష్, దాసరి కష్ణారావు, టిడిపి నియోజకవర్గ మీడియా కోఆర్డినేటర్ నేలపాటి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు. **శింగరాయకొండ :** యువతకు ఉపాధి కల్పిస్తూ ఇటీవల టిడిపి అధినేత చంద్రబాబు నాయకుడు విడుదల చేసి మేనిఫెస్టోను హర్షిస్తూ తెలుగు యువత అధ్యక్షుడు షేక్ సనావుల్లా ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేల్పుల సింగయ్య, చీమకుర్తి కష్ణ ,కూనపురెడ్డి వెంకటసుబ్బారావు, మించాల బ్రహ్మయ్య, సన్నెబోయిన శ్రీనివాసులు నాయుడు, షేక్ అబ్దుల్ సుబహాన్ , షేక్ యస్ధాని, ఇమ్మిడిశెట్టి రామారావు, కల్లగుంట నరసింహా, ఓలేటి రవిశంకర్ రెడ్డి ,కనిగిరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఆరోగ్యశ్రీ వర్తింపు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పొదిలి

ఆరోగ్యశ్రీ పథకం అర్హులందరికీ వర్తించేలా చర్యలు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కుందూరు నాగార్జున రెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వాలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ కార్డును అందరికీ వర్తిస్తుందన్నారు. దానికి రేషన్ కార్డుతో పని లేదన్నారు. 10 ఎకరాల లోపు అనే లిమిట్ లేదన్నారు. ఆరోగ్యశ్రీ కార్డు, 35 ఎకరాల భూమి ఉన్న రైతులకు వర్తిస్తుందన్నారు. ఈ విషయాన్ని వాలంటీర్లు గుర్తించాలన్నారు. మార్కాపురం, తర్లుపాడు మండలాలలో ఇటీవల సుమారు 10 కుటుంబాలు ఆరోగ్యశ్రీ కార్డులేక వైద్యం కోసం ఇబ్బందులు పడిన విషయాన్ని గుర్తుచేశారు. నగర పంచాయతీ కమిషనర్, మండల అభివృద్ధి అధికారి, వాలంటీర్లు సమన్వయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగార్జున రెడ్డి

చేసుకొని ప్రతి కుటుంబానికి సెల్ఫ్ డిక్లరేషన్ తీసుకుని తక్షణమే ఆరోగ్యశ్రీ కార్డు జనరేట్ అయ్యేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. కార్డు రావడంలో ఆలస్యం జరుగుతున్నందున ప్రాథమిక దశలో ఆ కుటుంబానికి ఆరోగ్యశ్రీకి సంబంధించిన యునిక్ నెంబర్ జనరేట్ అవుతుందన్నారు. దాన్ని ప్రింట్ తీసి వారికి అందిస్తే ఆరోగ్య సేవల్లో ఇబ్బందులు అధిగమించేందుకు దోహదపడుతుందన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తున్న వాలంటీర్లు సంక్షేమ పథకాలను అమలు ప్రజలకు అందజేయడంలో కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. అనంతరం వాలంటీర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీకృష్ణ, ఇఒఆర్‌డి రాజశేఖర్, నగర పంచాయతీ కమీషనర్ డానియల్ జోసఫ్, మాజీ ఎంపిపి కోవెలకుంట్ల నరసింహారావు, జిల్లా ఆహార సలహా సంఘం సభ్యుడు కొండ్రగుంట సుబ్బారావు, వైసిపి జిల్లా కార్యదర్శి గొలమారి చెన్నారెడ్డి, వైసిపి నగర పంచాయతీ వైసిపి అధ్యక్షురాలునూర్జహాన్ బేగం, నగర పంచాయతీ బీసీ సెల్ అధ్యక్షుడు పులగొర్ల శ్రీనివాసులు, ఎస్‌సి సెల్ అధ్యక్షుడు మల్లాపురం చిన నరసింహాలు, సర్పంచులు ఆవుల వెంకట సుబ్బారెడ్డి, ఉప్పలపాడు సర్పంచి తాళ్లూరి గంగయ్య, మాజీ సర్పంచి ఉలవా గోపి, గ్రామ నాయకులు గుంటూరి పిచ్చిరెడ్డి, పేరం కోదండ రామిరెడ్డి, ఆనికాళ్ల ఈశ్వర రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

ప్రజాశక్తి-టంగుటూరు

జిల్లాలోని మహాత్మ జ్యోతిబా పూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలలోని ఇంగ్లీష్ మీడియంలో సీట్ల భర్తీ కోసం దరఖాస్తు చేసుకోవాలని టంగుటూరు ఎంజెపి గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ కొమ్ము రాజారావు తెలిపారు. జిల్లాలో కొండెపి (టంగుటూరు), దరిమడుగు లోని ఎంజెపి బాలుర పాఠశాల, కనిగిరి, మార్కాపురం లోని ఎంజెపి బాలికల పాఠశాలలో ఇంగ్లీష్ మీడియం సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. 6, 7, 8 మరియు 9వ తరగతి లోని వివిధ కేటగిరీలలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం ఈనెల 3 నుంచి 9లోపు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 12 ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపిక చేసి వారి ప్రతిభ ఆధారంగా అర్హత సాధించిన తరగతిలోనే విద్యార్థులను చేర్చుకుంటామన్నారు. ఇతర వివరాలకు 9515121249, 9515411954, 9441130614 నంబర్లను సంప్రదించాలన్నారు.

సబ్సిడీపై పండ్ల మొక్కలు

జరుగుమల్లి : ఐదు ఎకరాల లోపు భూమి కలిగిన చిన్న, సన్న కారు రైతులకు ఉపాధి హామీ చట్టం ద్వారా 100 శాతం సబ్సిడీపై ఉచితంగా పండ్ల మొక్కలు పంపిణీ చేయనున్నట్లు ఎపిఒ కొక్కిలిగడ్డ నాగరాజు తెలిపారు. మొక్కలు నాటేందుకు గుంతలు తీసేందుకు అయ్యే ఖర్చు, మొక్కలు నాటిన తరువాత సేంద్రీయ ఎరువులు ఏడాదికి రెండు సార్లు ఉచితంగా ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. నీరు పెట్టేందుకు ఒక్కొక్క మొక్కకు రూ.5 ఇవ్వనున్నట్లు తెలిపారు. నిమ్మ, మామిడి, సపోటా, బత్తాయి, కొబ్బరి, డ్రాగన్ ఫ్రూట్, తైవాన్ జామ, జామ, గులాబి, మల్లె, సీతాఫలం, యాపిల్ బేర్, దానిమ్మ, నేరేడు, మునగ మొక్కలు పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. మొక్కలు కావాల్సి రైతులు ఎంపిడిఒ, ఎపిఒ, పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్ వద్ద తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

రీసర్వే పూర్తి చేయాలి : తహశీల్దారు

సిఎస్ పురం రూరల్ : భూముల రీ సర్వే వేగవంతంగా పూర్తి చేయాలని తహశీల్దారు నాగార్జున్ రెడ్డి తెలిపారు. రెవెన్యూ అధికారులు, సర్వేయర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దారు మాట్లాడుతూ రైతుల మధ్య ఎలాంటి సమస్యలు రాకుండా అధికారులు సర్వే పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ మల్లికార్జున రావు, సర్వేయర్ రాజేష్, సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట

పెద్దదోర్నాల : మండల పరిధిలోని నల్లగుంట్ల గ్రామంలో సీతారామ విగ్రహ ప్రతిష్ట శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి యర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు పాల్గొని స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు భట్టు సుధాకర్‌రెడ్డి, దొడ్డా శేషాద్రి, జేసు నాగేంద్రబాబు, శేఖర్, రామకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



డ్రెయినేజీ పనులను పరిశీలిస్తున్న సర్పంచి

డ్రెయినేజీ పనులు పరిశీలన

శింగరాయకొండ : శింగరాయకొండ గ్రామ పంచాయతీ పరిధిలోని హనుమాన్ నగర్ నూతనంగా నిర్మించిన డ్రైనేజీని సర్పంచి తాటిపర్తి వజన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ అవసరమైన చోట డ్రైనేజీలను నిర్మిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు తన్నీరు నాగేశ్వరరావు, నాయకులు మస్తాన్ , ఫిరోజ్, సిరిమల్లె రమేష్, సవలం కోటేశ్వరరావు, జాన్ కిషోర్, అనిల్, చేవూరి కోటేశ్వరరావు, ప్రణయ్ కుమార్ పాల్గొన్నారు.

'ఉపాధి'కి నిధులు తగ్గించడం దారుణం

5న కలెక్టరేట్ ఎదుట ధర్నాను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకుల పిలుపు

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

ఉపాధి హామీ చట్టానికి కేంద్ర ప్రభుత్వం నిధులు తగ్గించడం దారుణమని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి టి కృష్ణమోహన్ అన్నారు. ఈ నెల 5వ తేదీన బాపట్ల కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నా విజయవంతం చేయాలని ఆయన ప్రచారం నిర్వహించి కూలీలతో మాట్లాడారు. బాపట్ల మండలం మూలపాలెం గ్రామంలో శుక్రవారం కార్మిక సంఘం ఆధ్వర్యంలో పని ప్రదేశాల్లో వ్యవసాయ కూలీల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకొన్నారు. ఈ నెల 5వ తేదీన ఉపాధి సమస్యల పరిష్కారంపై కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో ఉపాధి కూలీలు పెద్దఎత్తున పాల్గొనాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా కృష్ణ మోహన్ మాట్లాడుతూ వంద రోజులకు తగ్గకుండా పని చూపించాలని అన్నారు. కూలి డబ్బులు సక్రమంగా వచ్చే విధంగా చూడాలని కూలీలు కోరారు. ఆన్‌లైన్ ఫొటో విధానాన్ని ఎత్తివేయాలని, పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని, గతంలో లాగా సమ్మర్ అలవెన్స్ పలుగు, పారకు డబ్బులు ఇవ్వాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టానికి భారీగా నిధులు తగ్గించడం వల్ల ఉపాధి కూలీలు పనిచేసే చోట కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయలేని దుస్థితి ఏర్పడిందని కృష్ణమోహన్ అన్నారు. ఉపాధి కూలీలు ఫొటో యాప్ ద్వారా చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కనీసం పనిచేసేచోట టెంటు సౌకర్యం, మంచినీళ్లు, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్టు, ఇతర బీమా సౌకర్యం లేకపోవడం అన్యాయమని అన్నారు. ఈ సౌకర్యాలు లేకపోవడంతోనే తీవ్రమైన ఎండలు ఉండడంతో వడదెబ్బ తగిలి కూలీలు మరణిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి ఇచ్చే బీమా సౌకర్యం కూడా ఇవ్వడం లేదన్నారు. తక్షణమే పైస్థాయి అధికారులు ఇటువంటి సమస్యలను గుర్తించి పరిష్కరించాలని కోరారు. ఈ విషయంపై ఉపాధి కూలీలతో జూన్ ఐదో తేదీన బాపట్ల కలెక్టరేట్ వద్ద ధర్నా జరుగుతుందని, కూలీలు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మేస్త్రీలు బాబూరావు, ఎస్తేరురాణి, కళావతి, మేరెమ్మ, జ్యోతి, కూలీలు పాల్గొన్నారు.



బల్లికురవ మండలంలో ఉపాధి కూలీలతో కలిసి కరపత్రం ఆవిష్కరిస్తున్న తంగిరాల వెంకటేశ్వర్లు

పంగులూరు: పేదలకు ఉపాధి కల్పించి, వారి ఆర్థిక ఇబ్బందులను తొలగించే మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసేందుకు, కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, ఆ ప్రయత్నాలను అడ్డుకొని చట్టాన్ని కాపాడుకునేందుకు వ్యవసాయ కార్మికులంతా ఉద్యమించాలని, వ్యవసాయ కార్మిక సంఘం పంగులూరు మండల కమిటీ సమావేశం తీర్మానించింది. కమిటీ సమావేశం శుక్రవారం పంగులూరులో ఆదుం సాహెబ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం బాపట్ల జిల్లా అధ్యక్షుడు మోంద్రు ఆంజనేయులు మాట్లాడుతూ, ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకునేందుకు వ్యవసాయ కూలీలంతా ఉద్యమించాలని అన్నారు. ఈ నెల 5వ తేదీన బాపట్లలోని జిల్లా కలెక్టరేట్ ముందు జరిగే ధర్నా కార్యక్రమంలో ఉపాధి కూలీలంతా హాజరై జయప్రదం చేయాలని అన్నారు. సంఘం నాయకుడు పూసపాటి సుబ్బరాజు మాట్లాడుతూ వ్యవసాయ కూలీలను ఐక్యపరిచి ఉద్యమాల్లోకి నడిపించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం కార్యకర్తలు తానికొండ సుధాకర్, చింతలచెరువు బాబురావు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాయిని వినోద్ బాబు తదితరులు పాల్గొన్నారు.

బల్లికురవ రూరల్: ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగే ధర్నాని జయప్రదం చేయాలని కోరుతూ మండలంలోని కూకట్లపల్లి, గొర్రెపాడు గ్రామాలలో శుక్రవారం వ్యవసాయ సంఘ ఉపాధ్యక్షుడు జిల్లా తంగిరాల వెంకటేశ్వర్లు పర్యటించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కార్మికులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు బాపట్ల జిల్లా వ్యవసాయ సంఘం ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకువచ్చారు. కొంతమంది కార్మికులకు ఆధార్ అప్డేట్ లేదని పనులు కల్పించడం లేదని, సమ్మర్ అలవెన్స్ లేకుండా పోయాయని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ నెల 5వ తేదీన జరిగే ధర్నాలో ఉపాధి కార్మికులందరూ పాల్గొనాలని వెంకటేశ్వర్లు ఉపాధి కూలీలను కోరారు.



జిల్లా నైపుణ్యాభివద్ధి కమిటీ తొలి సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా

యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా

అధికారులు పని చేయాలి: కలెక్టర్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

యువతలో నైపుణ్యాలకు మెరుగులు దిద్దడం, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా అధికారులు పని చేయాలని జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా తెలిపారు. ఉపాధి కల్పనశాఖ, నైపుణ్య అభివృద్ధి సంస్థల ఆధ్వర్యంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి కమిటీ తొలి సమావేశం శుక్రవారం స్థానిక స్పందన సమావేశ మందిరంలో జరిగింది. 26 ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులతో ఏర్పడిన కమిటీ తొలి సమావేశం ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్న జిల్లా కలెక్టర్ అధ్యక్షత వహించారు. 'బాపట్ల ఆణిముత్యాలు' వంటి పేర్లతో జిల్లా యువత కోసం ప్రత్యేక పోర్టల్ రూపొందించాలని జిల్లా కలెక్టర్ చెప్పారు. నైపుణ్యాలు లేని యువత, ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగులు, పరిశ్రమల యాజమాన్యాన్ని ఒకే వేదికపై తెచ్చేలా పోర్టల్ ఉండాలన్నారు. సమాజంలో డిమాండ్ ఉన్న రంగాలు, డిమాండ్ ఉన్న ఉద్యోగ అవకాశాలను గుర్తించి పోర్టల్లో నిక్షిప్తం చేయాలన్నారు. నిరుద్యోగులు ఇష్టంగా ఆసక్తితో శిక్షణ పొందే వాటి వైపు అధికారులు దృష్టి సారించాలన్నారు. నిరుద్యోగులలో నైపుణ్యాలు వృద్ధి కల్పించేలా శిక్షణ ఇవ్వాలన్నారు. అధికారులంతా సమన్వయంతో పనిచేస్తే బాపట్ల జిల్లాలోని నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తాయన్నారు. జిల్లాలో ప్రతి నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఆరు నైపుణ్య అభివృద్ధి హబ్‌లు ఉంటే అందులో రెండు మాత్రమే పనిచేస్తున్నాయన్నారు. మిగిలిన నాలుగు హబ్‌లు మనుగడలో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాల న్నారు. జిల్లాలో 16 ఎంప్లాయిమెంట్ స్కిల్స్ కాలేజీలు ఉన్నాయని అన్నారు. నిరుద్యోగ శిక్షణా కార్యక్రమాలు వారికి ఉపాధి కల్పించేవిగా ఉండాలన్నారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు, వనరులు సమకూర్చడమే లక్ష్యంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి రంజిత్ బాషా అన్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని యువత అందిపుచ్చుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఉపాధి రంగాలను స్వయంగా సృష్టించుకునేలా యువతకు మార్గనిర్దేశం చేయాలన్నారు. జిల్లాలో బీటెక్ ఇంజినీరింగ్ పూర్తి చేసిన విద్యార్థులు సంఖ్యను పోర్టల్లో ఉంచాలన్నారు. విద్యార్హతలు పూర్తిచేసిన నిరుద్యోగుల వివరాలు పక్కాగా సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. నిరుద్యోగులకు అన్ని విధాలుగా ఉపయోగపడేలా పోర్టల్ ఉండాలని వివరించారు. ఈ సమావేశంలో జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి జి సుధాకర్, జిల్లా ఉపాధి కల్పనా అధికారి రమాదేవి, డిఆర్‌డిఎ పీడీ బి అర్జున్ రావు, ఫిష్ కోపెడ్ దక్షిణ భారత శాస్త్రవేత్త ఏ నగేష్ బాబు, జిల్లా ప్రత్యేక అధికారి శివనాగరాజు, పరిశ్రమల శాఖ జిఎం మదన్ మోహన్, డీపీఓ రమేష్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



గృహ నిర్మాణాలు, సంక్షేమ కార్యక్రమాలపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

గృహ నిర్మాణాల్లో పురోగతికి కృషి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జగనన్న కాలనీలలోని పక్కా గృహ నిర్మాణాలలో పురోగతి సాధనకు అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా ఆదేశించారు. గృహ నిర్మాణాలు, వివిధ సంక్షేమ కార్యక్రమాలపై డివిజన్, మండల, గ్రామ సచివాలయాల స్థాయి అధికారులతో శుక్రవారం ఆయన వీక్షణ సమావేశం ద్వారా సమీక్షించారు. పక్కా గృహాలు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు తక్షణమే బిల్లులను చెల్లించాలని కలెక్టర్ తెలిపారు. పునాది దిగువన ఉన్న గృహాలు పునాది దశకు, పునాది దశలోవి, రూఫ్ దశకు రూఫ్‌లో ఉన్నవి, శ్లాబ్ దశలో ఉన్న గృహాలు జూలై నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అధికారులకు వ్యక్తిగతంగా నిర్దేశించిన లక్ష్యాలు రెండు వారాలలో తప్పనిసరిగా చేరుకోవాలన్నారు. మండల ప్రత్యేక అధికారులతో ఆర్‌డిఒలు ప్రతిరోజూ సమావేశాలతో సమక్షించుకోవాలన్నారు. సొంత స్థలాలకు మంజూరైన గృహాలు ఇప్పటి వరకు నిర్మించుకోకపోతే వాటిని రద్దు చేసి ఇతరులకు కేటాయించాలన్నారు. మండలాల ప్రత్యేక అధికారులు సమావేశానికి గైర్హాజరైతే వారికి షోకాజ్ నోటీస్ జారీ చేయాలన్నారు. గృహ నిర్మాణాలలో పురోగతి సాధించలేకపోతున్న సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ తెలిపారు. పురోగతి ఆధారంగా ప్రతి 15 రోజులకు వారి పనితీరును ప్రామాణికంగా తీసుకుంటామన్నారు. ప్రతి నెలలో జిల్లాలో కనీసం రెండు వేల గృహాల నిర్మాణం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. పిఎంఎవై గ్రామీణ్ పథకం కింద 16,000 గృహాలు లక్ష్యం కాగా ప్రస్తుతం 7,000 గృహాల నిర్మాణం పూర్తి అయ్యిందన్నారు. 2,000 గృహాల నిర్మాణాలు జరిగేలా చూడాలని, పురోగతిలో ఉన్నవి త్వరగా పూర్తి చేయాలని అన్నారు. కొరిశపాడు, కొల్లూరు, మార్టూరు, చెరుకుపల్లి, వేమూరు, చినగంజాం మండలాల్లో తక్కువగా ఉన్న పురోగతిని పెంచాలన్నారు. జల జీవన్ మిషన్ పనులకు సంబంధించిన బిల్లులు రెండు వారాల్లో బిల్లులు అప్‌లోడ్ చేయాలని అన్నారు. స్వచ్ఛ సర్వేక్షన్, అమృత్ సరోవర్, జగనన్న శాశ్వత భూ హక్కు, రీ సర్వే పనుల పురోగతి కోసం అధికారులు చిత్తశుద్ధితో పనిచేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చుని అన్నారు. జగనన్న లే అవుట్‌లను మండల ప్రత్యేక అధికారులు ప్రతి శనివారం విధిగా పరిశీలించాలని జిల్లా సంయుక్త కలెక్టర్ సిహెచ్ శ్రీధర్ ఆదేశించారు. జిల్లాలో 5,957 మందికి తహశీల్దారు పొజిషన్ సర్టిఫికెట్స్ ఇవ్వాలన్నారు. వర్షాలు కురియక ముందే గృహ నిర్మాణాలలో పురోగతి వచ్చేలా చూడాలని సూచించారు. వీక్షణ సమావేశంలో డిఆర్‌వో కె లక్ష్మీశివజ్యోతి, ఆర్డీవోలు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

టిడిపి మేనిఫెస్టోతో బిసిలకు మేలు

ప్రజాశక్తి-భట్టిప్రోలు



పులిమి డోలా శివకుమార్

బలహీన వర్గాలు అభ్యున్నతికి ప్రత్యేక చట్టాన్ని తీసుకువస్తామని రాజమండ్రిలో జరిగిన మహానాడులో టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు ప్రకటించటం హర్షణీయమని తెలుగుదేశం పార్టీ బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి పులిమి డోలా శివకుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపిలోనే బలహీనవర్గాల వారికి రాజకీయంగా చట్ట సభలలో పదవులు కల్పించినట్లు తెలిపారు. బిసిలకు ప్రత్యేక చట్టం తీసుకువస్తామని చంద్రబాబు ప్రకటించటం గర్వకారణమని అన్నారు. పార్టీ ఏర్పడిన నాటి నుంచి బిసి వర్గాలు పార్టీకి అండగా ఉన్నాయని, ఈ చట్టం ద్వారా బిసిలకు మరింత న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

వైద్య శిబిరానికి 250 మంది హాజరు

ప్రజాశక్తి-పంగులూరు

పంగులూరు మండలంలోని రామకూరు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం గ్రామ ఉపసర్పంచ్ పెడవల్లి అశోక్ ఆధ్వర్యంలో కిమ్స్ హాస్పిటల్స్ ఒంగోలు సహకారంతో ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించినట్లు వైద్య శిబిర సమన్వయకర్త తాళ్లూరి రామాంజనేయులు, కిమ్స్ అద్దంకి ఏరియా పిఆర్ఓ పి కాలేషావలి తెలిపారు. ఈ వైద్య శిబిరాన్ని గ్రామ ఉపసర్పంచ్ పెడవల్లి అశోక్ ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో కిమ్స్ వైద్యులు డాక్టర్ బైపనేని రామాంజనేయులు సుమారు 250 మంది రోగులకు బిపి, షుగర్, ఈసీజీ పరీక్షలు నిర్వహించి, వారికి ఒక వారం రోజులకు సరిపడా మందులను కూడా ఉచితంగా అందజేశారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 25 మంది రోగులు కంటి లోపల శుక్లములు, పొరలు ఉన్నవారికి ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఒంగోలులోని కిమ్స్ హాస్పిటల్స్‌లో ఉచితంగా ఆపరేషన్స్ నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయం ఏఎన్ఎం శ్రావణి, ఆశ వర్కర్లు, కిమ్స్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ ఈతల పోటీలకు బాపట్ల విద్యార్థి జ్ఞాన వివేక్

ప్రజాశక్తి-బాపట్ల రూరల్



ఈ నెల 5వ తేదీ నుంచి ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి ఈతల పోటీలకు బాపట్ల జూనియర్ కళాశాల విద్యార్థి ఉప్పాల జ్ఞాన వివేక్ గౌడ్ ఎంపిక అయ్యాడని కళాశాల ప్రిన్సిపాల్ చిన్నమ్మాయి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంవత్సరం జనవరిలో తిరుపతిలో జరిగిన రాష్ట్ర స్థాయి ఈతల పోటీలలో ఉమ్మడి గుంటూరు జిల్లా తరపున పాల్గొన్న వివేక్ రెండు వెండి పథకాలు సాధించాడు. ఈ నేపథ్యంలో ఢిల్లీలో జరిగే పోటీలలో పాల్గొనడానికి అవకాశం దొరికిందన్నారు.

విద్యుత్ శాఖలో సాధారణ బది'లీలలు'

నిబంధనలు పాటించని జిల్లా అధికారులు

ప్రజాశక్తి-మార్కాపురం

ప్రకాశం జిల్లా విద్యుత్ శాఖలో సాధారణ బది'లీలలు' ప్రస్తుత బదిలీల్లోనూ కనిపిస్తున్నాయి. ఆ శాఖ ఉన్నతాధికారుల లీలతో కొందరు దశాబ్దాలుగా ఒకే ప్రాంతంలో తిష్ట వేశారు. దీని కారణంగా కొందరికి బదిలీల అవకాశం రాక... కోరుకున్న ప్రదేశానికి వెళ్లలేక తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. బదిలీ నిబంధనలను విద్యుత్ శాఖ జిల్లా స్థాయి అధికారులు పాటించకపోవడమే అందుకు కారణం.!

ప్రభుత్వ నిబంధనల ప్రకారం..ఒకే ప్రదేశంలో ఐదు సంవత్సరాలు దాటిన వారికి బదిలీల్లో 10 శాతం మందికి అవకాశం ఉంటుంది. రెండు సంవత్సరాలు దాటిన వారు ఒక వేళ మరో ప్రాంతానికి బదిలీ కావాలని అభ్యర్థిస్తే కూడా ఉన్నతాధికారులు బదిలీ చేసే అవకాశం ఉంటుంది. అంతే కాకుండా మ్యూచువల్ బదిలీలు కూడా చేసే అవకాశం ఉంది. నిబంధనలు పాటిస్తే బదిలీల్లో అర్హులకు న్యాయం జరిగే అవకాశం ఉంది. నిబంధనలు పాటించని కారణంగా కొందరు బదిలీలకు అర్హత ఉండీ కూడా బదిలీకి నోచుకోవడం లేదు. కారణం ఒకే ప్రదేశంలో సుదీర్ఘ కాలంగా పనిచేస్తున్న వారు బదిలీల సమయంలో సీనియార్టీతో ఉంటారు. ముందుకు బదిలీకి వారే అర్హులు. సీనియార్టీ కలిగిన వారు పనిచేస్తున్న ప్రదేశంలో మరో సీటుకు మార్పు చేసుకుంటూ బదిలీగా చూపడం జరుగుతోంది. రికార్డుల్లో సీనియార్టీ కలిగిన అధికారి లేదా ఉద్యోగి బదిలీ అయిట్లు ఉంటుంది. వాస్తవంగా బదిలీ చేశారంటే పనిచేస్తున్న ప్రదేశం లేదా కార్యాలయం నుంచి మరో ప్రదేశంలోని కార్యాలయానికి బదిలీ కావాల్సి ఉంది. కానీ ఇక్కడ బదిలీ అంటే అదే కార్యాలయంలో మరో సీటుకు పరిమితం చేస్తూ... కుర్చీలాటగా బది'లీలలు' కొనసాగిస్తున్నారు. దీంతో బదిలీల కోసం అవకాశం రాక కొందరు మగ్గుతున్నారు.

ప్రస్తుతం జిల్లా విద్యుత్ శాఖలో వివిధ క్యాడర్లలో 55 బదిలీలు జరిగాయి. అందులో సగం బదిలీలు మరో ప్రాంతానికి కాకుండా ప్రస్తుత పని ప్రదేశంలోనే సీటు మార్పుతో పాతుకుపోయారు. సీనియర్ అసిస్టెంట్ల క్యాడర్‌లో 13 మంది, జూనియర్ అసిస్టెంట్ల క్యాడర్‌లో ఎనిమిది మంది, జూనియర్ ఇంజనీర్ల క్యాడర్‌లో ముగ్గురు స్థానచలనం లేకకుండా వారు పనిచేస్తున్న కార్యాలయాల్లో సీటు మార్పుతో కొనసాగేలా బదిలీ ఉత్తర్వులు తీసుకోవడం గమనార్హం. ఈ వ్యవహారంలో పెద్ద ఎత్తున సంబంధిత అధికారులకు కాసుల పంట పండుతోందని భోగట్టా. అందుకే ఆ శాఖ పెద్దలు ఇబంధనలు గాలికి వదిలేసినట్లు ఆ శాఖలో ఉద్యోగులు గుసగుసలాడుతున్నారు. విద్యుత్ శాఖ ఉద్యోగులతో ఓ వైపు పిఆర్‌సి చర్చలు జరుపుతూ మరో వైపు బదిలీల్లో అక్రమాలను గుట్టుగా సాగించడం గమనార్హం. విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు జిల్లా స్థాయిలో చేసిన ప్రస్తుత బదిలీలను చూస్తే అక్రమాలు ఎలా జరిగాయో తెలుసుకునే అవకాశం లేకపోలేదు.!

4న 'ఒయాసిస్'లో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-ఒంగోలు

ఒంగోలు, అంజయ్య రోడ్‌లోని ఒయాసిస్ ఫెర్టిలిటీ సెంటర్‌లో ఈ నెల నాలుగున ఉదయం పది గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఉచిత సంతాన సాఫల్యత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మేనేజర్ యామిని తెలిపారు. శిబిరంలో సంతానలేమి స్పెషలిస్ట్ డాక్టర్ దీపిక బొప్పనతో ఉచిత కన్సల్టేషన్ మరియు ఉచిత స్కాన్ మరియు ఉచిత ఐయుఐ చేయబడుతుందన్నారు. పూర్తి వివరాలకు 7842173132 నెంబర్‌ని సంప్రదించాలని కోరారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

డార్విన్ పరిణామ సిద్ధాంతం తొలగించడం

సైన్స్ పరిశోధనలపై దాడి చేయడమే..

ఎమ్మెల్సీ లక్ష్మణరావు

ప్రజాశక్తి-చీరాల

మానవజాతి అభివద్ధిలో శాస్త్రీయబద్ధమైన డార్విన్ పరిణామ సిద్ధాంతం ప్రపంచ దేశాలన్నీ ఆమోదించి ఉంటే అలాంటి పాఠ్యాంశాలను పుస్తకాలు నుండి తొలగించడం సైన్స్ పరిశోధనలపై మతోన్మాద భావజాలం దాడి చేయడమేనని ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు అన్నారు. ప్రోగ్రెసివ్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో చీరాల విద్యాకాలేజీ కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం ఏర్పాటుచేసిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. విద్యార్థి దశ నుండే భారత సమాజాన్ని మతం ఆధారంగా విడగొట్టేందుకు, పాఠ్యాంశాలను కూడా మార్చేసేందుకు బిజెపి ప్రభుత్వం సిద్ధమైందని అన్నారు. రోమీల తాపర్ వంటి చరిత్ర పరిశోధకులు అనేక పరిశోధనలు చేసి.. శాస్త్రీయంగా రూపొందించిన పాఠ్యాంశాలను వక్రీకరిస్తున్నారని అన్నారు. ఈ ధోరణి భవిష్యత్ తరాలను నిర్వీర్యం చేస్తుందని చెప్పారు. ఈ దేశంలో ముస్లిములు, క్రైస్తవులు, బౌద్ధులకు వ్యతిరేకంగా హిందువులను రెచ్చగొట్టేందుకు బిజెపి ప్రయత్నిస్తోందన్నారు. భారత సమాజ అభివద్ధికి తోడ్పడ్డ సామాజిక ఉద్యమకారులైన పెరియార్ రామస్వామి వంటి వారి జీవితచరిత్రలను సైతం పాఠ్యాంశాల నుండి తొలగిస్తున్నారని అన్నారు. సదస్సుకు జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు కుర్రా రామారావు అధ్యక్షత వహించారు. సదస్సులో సిఐటియు రాష్ట్ర నాయకులు వై సిద్ధయ్య, యుటిఎఫ్ బాపట్ల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వినయ్‌కుమార్, అడుగుల శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు బండి బిక్షాలుబాబు, సిఐటియు అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.బాబురావు, ఎం.వసంతరావు పాల్గొన్నారు.



గడపగడపకూ..లో పాల్గొన్న కుందురు

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పొదిలి

సిఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మార్కాపురం శాసనసభ్యులు కుందురు నాగార్జునరెడ్డి అన్నారు. శుక్రవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఏలూరు గ్రామంలో ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలను వివరించి కరపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయనకు జిల్లా సేవాదళ్ అధ్యక్షులు, మండల పార్టీ మాజీ కన్వీనర్ గుజ్జుల సంజీవరెడ్డి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సుమారు రూ.16 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డును ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ శ్రీకృష్ణ, ఇఓఆర్‌డి కె రాజశేఖర్, మాజీ ఎంపిపి కోవెలకుంట్ల నరసింహారావు, జిల్లా ఆహార సలహాసంఘం సభ్యులు కొండ్రగుంట సుబ్బారావు, వైసిపి జిల్లా కార్యదర్శి గొలమారి చెన్నారెడ్డి, నగర పంచాయతీ వైసిపి అధ్యక్షురాలు ఎస్‌కె నూర్జాహాన్ బేగం, సర్పంచ్ తాళ్లూరి గంగయ్య, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు గుజ్జుల సుబ్బారెడ్డి, నాయకులు ఉలవా గోపి, కార్యదర్శి శేషగిరి పాల్గొన్నారు.


నేటి నుంచి స్టడీ టూర్

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

దేశంలోని వివిధ రాష్ట్రాలలో ఉన్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లను సందర్శించి అక్కడ జరిగే అభివృద్ధి, సుందరీకరణ విషయాలను తెలుసుకునేందుకు ఒంగోలు నగరంలోని అధికార పార్టీ కార్పొరేటర్లు చేపట్టిన విజ్ఞాన యాత్ర (స్టడీటూర్) శనివారం నుంచి ప్రారంభం కానుంది. శనివారం రాత్రి ప్రత్యేక బస్సుల్లో వీరు హైదరాబాద్ బయలుదేర నున్నారు. అక్కడ నుంచి విమానంలో ఢిల్లీ వెళతారు. అక్కడ నుంచి వివిధ రాష్ట్రాల్లో ఉన్న ప్రముఖ మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లను సందర్శిస్తారు. ఒకరిద్దరు అధికార పార్టీ కార్పొరేటర్లు మాత్రం ఈ యాత్రకు వెళ్లడం లేదని సమాచారం. యాత్ర కోసం కార్పొరేషన్ నిధులు రూ.39 లక్షలు ఖర్చు చేయనున్నారు.

'ఏరువాక'ను జయప్రదం చేయండి

ప్రకాశం జిల్లా అభివృద్ధి వేదిక అధ్యక్షులు చుండూరి రంగారావు



ఏరువాక కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లా కేంద్రమైన ఒంగోలులో ఈ నెల 4న జరగనున్న ఏరువాక కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ప్రకాశం జిల్లా అభివద్ధి వేదిక అధ్యక్షులు చుండూరి రంగారావు పిలుపునిచ్చారు. ఒంగోలు ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో చుండూరి రంగారావు మాట్లాడుతూ ఒంగోలు నగర పరిధిలోని త్రోవగుంట వద్ద ఉన్న చీరాల-దిగమర్రు రోడ్డులో ఎద్దుల అరకలతో ఏరువాక కార్యక్రమం ఉదయం 9 గంటల నుండి 10 గంటల వరకు జరుగుతుందన్నారు. అనంతరం ఆచార్య రంగా భవన్‌లో రైతు సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్, మాజీ వ్యవసాయ శాఖ మాజీ మంత్రి వడ్డే శోభనాదేశ్వర్ రావు, జీన్ క్యాంపెయిన్ ఫౌండర్ డాక్టర్ సుమన్ సహాయ్, కర్ణాటక రాజ్య రైతు సంఘం గౌరవాధ్యక్షులు చామరస పాటిల్, అధ్యక్షులు నాగేంద్ర, రైతు స్వరాజ్య వేదిక తెలంగాణ ఆంధ్ర రాష్ట్ర సమన్వయకర్త విస్సాకిరణ్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అధ్యక్షుడు కృష్ణయ్య, తదితరులు పాల్గొంటారన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకటరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం లిఖిత పూర్వకంగా ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వి.హనుమారెడ్డి మాట్లాడారు. సమావేశంలో అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు, ఆచార్య రంగా భవన్ ప్రధాన కార్యదర్శి చుంచు శేషయ్య, సిపిఐ(ఎంఎల్) జిల్లా కార్యదర్శి ఎస్.లలిత కుమారి, పరిటాల కోటేశ్వరరావు, బి.సుబ్బారావు, ఒపిడిఆర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చావలి సుధాకర్‌రావు పాల్గొన్నారు.

కౌలురైతులకు గుర్తింపు కార్డులివ్వాలి

కౌలురైతుల సంఘం డిమాండ్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

భూ యజమానితో సంబంధం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డు ఇవ్వాలని కౌలు రైతుసంఘం జిల్లా కార్యదర్శి వి.బాలకోటయ్య డిమాండ్ చేశారు. కౌలు చట్టంలో మార్పులు చేయాలని కోరుతూ ఈ నెల 5 నుంచి 10 వరకు రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న జీపు యాత్రలను జయప్రదం చేయాలని, 11 ,12 తేదీలలో మంగళగిరి సిసిఎల్‌ఎ ఆఫీస్ వరకు చేపట్టిన రాయబార పాదయాత్రను జయప్రదం చేయాలని కోరుతూ శుక్రవారం సంఘ కార్యాలయంలో పోస్టర్లు, కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి వి.బాలకోటయ్య మాట్లాడుతూ చట్టం మార్పు చేయాలని జరుగుతున్న కార్యక్రమంలో కౌలు రైతులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. రైతు శ్రేయోభిలాషులు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు సంపూర్ణ మద్దతు ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్‌కె మాబు, సంఘ నాయకులు టి.శ్రీకాంత్, రైతుసంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావు, వ్యవసాయ కార్మిక జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలపై

నిర్లక్ష్యం వహిస్తే సహించం..

కలెక్టర్ దినేష్‌కుమార్



లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-త్రిపురాంతకం

గృహ నిర్మాణాలపై నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని కలెక్టర్ ఎఎస్.దినేష్ కుమార్ గృహ నిర్మాణ శాఖాధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన త్రిపురాంతకం మండలంలోని రాజుపాలెం గ్రామంలో గత ప్రభుత్వ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించి.. రికార్డులను పరిశీలించారు. ఉపాధ్యాయులతో ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు నాణ్యమైన విద్య బోధించాలని సూచించారు. మండలంలోని త్రిపురాంతకం హౌసింగ్ లే అవు ట్‌లను పరిశీలించి సమీక్ష సమావేశం నిర్వహించారు. త్రిపురాంతకం జగనన్న కాలనీలో లే అవుట్‌లను పరిశీలించారు. హౌసింగ్, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వెలుగు ఏపీఎంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. త్రిపురాంతకం 1, 2 లే అవుట్‌లో మొత్తం 549 ప్లాట్లు కాగా అందులో 341 గహాలు మంజూరయ్యాయని, దానిలో 281 గహ నిర్మాణాలు నిర్మించే ప్రయత్నం కూడా చేయకపోవడంపై ఆయన సంబంధిత శాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన లబ్ధిదారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అందులో ఎస్టీ కులాలకు చెందిన వారు తమకు గహాలు మంజూరైనప్పటికీ కట్టుకొనే స్తోమత లేక ఉండిపోయి పక్కనే పూరి గుడిసెలు వేసుకుని నివసిస్తున్నామని, తమకు ప్రభుత్వమే గహాలు నిర్మించి ఇవ్వాలని వారు విన్నవించుకున్నారు. మరికొంతమంది లబ్ధిదారులు తమకు ఇనుము, సిమెంట్, ఇసుక అందించడంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లో సహకరించడం లేదని, నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నారని తెలిపారు. దీనిపై కలెక్టర్ సంబంధిత అధికారులపై మండిపడుతూ తక్షణమే ఇనుము, సిమెంట్, ఇసుక అందించాలని ఆదేశించారు. ఎస్టీ కోయ జాతికి చెందిన 45 మంది లబ్ధిదారులు మాట్లాడుతూ రెక్కాడితే గాని డొక్కాడని బతుకులు తమవని, ప్రభుత్వమే ఇల్లు కట్టించి ఇవ్వాలని కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ వెంకట సుశీల మాట్లాడుతూ మంత్రి సురేష్ సహకారంతో 45 మంది కోయ జాతుల వారికి గహాలు నిర్మించి ఇస్తామని చెప్పడంతో కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో మార్కాపురం సబ్ కలెక్టర్ సేతు మాధవన్, హౌసింగ్ పీడీ పేరయ్య, ప్రత్యేక అధికారి చెన్నయ్య, హౌసింగ్ ఈఈ వెంకటస్వామి, డిఎల్‌డివో బివిఎన్ సాయికుమార్, డిప్యూటీ తహశీల్దార్ భ్రమరాంబ, ఎంపీడీవో సాంబశివరావు, ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి, సర్పంచ్ పొన్న వెంకటలక్ష్మి, లబ్ధిదారులు పాల్గొన్నారు.